
# కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక



జనవరి 2011

# కొత్తపల్లి కథల పుస్తకం -33 వ భాగం

**మూలం:** http://kottapalli.in


సంపాదకత్వం: **నారాయణ**

ప్రథమ ముద్రణ: **జనవరి 2011**

వెల:

**ప్రతి ఒక్కింటికి రూ. 20/-**

**పన్నెండు భాగాల ప్రత్యేక వెల: రూ. 240/-**

ఇంకు జెట్ ప్రింటర్లలో సిరంజిలతో మళ్ళీ మళ్ళీ ఇంకులు వేయటం ద్వారా ముద్రించబడ్డ ఈ పుస్తకం పూర్తిగా ఓపెన్ సోర్సు సాఫ్టువేర్లతో రూపొందించబడింది.



**కాపీరైటు:** ఈ పుస్తకంలోని ఏ అంశాన్నైనా ఎవరైనా తమ వాణిజ్యేతర కార్యక్రమాలలో పూర్తిగా ఉచితంగా, స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు. కేవలం ఆయా రచయితలకు, కొత్తపల్లి పత్రికకు వాటిని ఆపాదిస్తే సరి. వివరాలకు చూడండి: http://www.creativecommons.org వారి non-commercial, share alike license.



## కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

**ఫోను: 08559 240222 ఇ-మెయిలు: team@kottapalli.in**




# విషయసూచిక


**ముందుమాట**

నడుస్తూ పోదాం!...సంపాదకీయం...2

**ధారావాహిక**

నీతి చంద్రిక... 15 వ భాగం...4

**పిల్లలు రాసిన కథలు**

సింహం పెళ్ళి...చంద్రకళ...12

తోక ఎక్కడుంది?...సునీల్‌కుమార్...17

పాము సాయం...కృష్ణవేణి...19

పట్నం ఎలుక...సునీల్...23

కాకి తెలివి... రామాంజినమ్మ... 25

జూ!...నాగసుధాకర్...28

**పెద్దలు రాసిన కథలు**

జూ!... జయలక్ష్మి...30

తేలుబొమ్మ...నారాయణ...34

పరివర్తన...నాగలక్ష్మి...37

**అనువాద కథలు**

ఎన్ని రోజులు?...పర్తాప్ అగర్వాల్...42

జాబిలి తునక...మర్జాట కురునయ్యేమి...44

**పాటలు**

చిరుచిరు చేతుల...వెంకట్రావు గారు...56

చెట్టు చెట్టు ...సంకీర్తన బృందం...58

**బొమ్మకు కథ రాయండి**

ఇక్కడ త్రవ్వండి!...లలిత...60





**ముఖచిత్రం**

సంక్రాంతి సంబరాలు

చిత్రకారుడు: వీరాంజనేయులు

# నడుస్తూ పోదాం!

చైనాలో చూడదగిన  పవిత్ర స్థలాల్లో 'వూ-తాయ్' అనే పర్వతం ఒకటి ఉన్నదట. దాన్ని దర్శించుకునేందుకు  చాలా మంది బౌద్ధ సన్యాసులు, ఎంతో దూరం నుండి నడిచి వెళ్ళేవాళ్ళుట.

చాలా సంవత్సరాల క్రితం ఒకసారి అలాగే  ఆ పర్వతాన్ని దర్శిద్దామని బయలుదేరాడొక ముసలి సన్యాసి.  వయసు మళ్లింది; చాలా  బలహీనంగా ఉన్నాడు కూడాను. సన్యాసి కనుక, ఏరోజుకారోజు  అవసరాన్ని బట్టి భిక్షనర్థిస్తూ, కొండలు-గుట్టలు పట్టి నడుస్తూ పోయాడు. చాలా అలసిపోయాడు.  అట్లా చాలా నెలలపాటు నడిచాక, సుదూరంగా కనబడింది, వూ-తాయ్ పర్వతం!

ఆ గొప్ప పర్వతాన్ని చూసేసరికి, ఆయనకు ప్రాణం లేచివచ్చినట్లైంది.  కొంచెంసేపు అక్కడే నిలబడి, ఆ అద్భుత దృశ్యాన్ని చూసి మైమరచిపోయాడు.

కొద్దిగా తేరుకున్నాక, దగ్గర్లో ఎవరైనా మనుషులు కనబడతారేమోనని  అన్నివైపులా పరికించాడు సన్యాసి. అక్కడే రోడ్డు ప్రక్కన పొలంలో నడుంవంచి పనిచేస్తూ కనబడ్డది-  ఒక ముసలమ్మ .  "అమ్మా! నేను వూ-తాయ్ పర్వతాన్ని దర్శించుకునేందుకు వెళ్తున్నాను. పర్వతాన్ని చేరుకునేందుకు ఇంకా ఎంత కాలం పడుతుంది?" అడిగాడు సన్యాసి ఆమెను.

ఆమె లేచి నిలబడి అతనికేసి చూసింది ఒక క్షణం పాటు.  ఆపైన గొంతుతో ఏదో గరగరమని శబ్దంచేసి, మళ్ళీ తన పనిలో మునిగింది.  సన్యాసి మళ్ళీ అడిగాడు- ఇంకోసారి అడిగాడు- రెండు మూడు సార్లు అడిగినా ఆమెనుండి ఏ సమాధానమూ లేదు!

"బహుశ: ఆమెకు చెముడు అయిఉంటుంది-లేకపోతే మూగదేమో-" అనుకున్నాడు సన్యాసి. "ఇంకొంచెం ముందుకు పోయి, వేరే ఎవరినన్నా అడిగితే సరి-" అని, నడక మొదలుపెట్టాడు.

ఒక పది అడుగులు వేశాడో లేదో, ముసలమ్మ అరుపు వినబడింది వెనకనుండి- "రెండు రోజులు! మీరు కొండను చేరుకునేందుకు ఇంకా రెండు రోజులు పడుతుంది!" అని.


సన్యాసి ఓమాటు వెనక్కు తిరిగి "నీకు చెముడేమో అనుకున్నాను- నేను అడిగినదానికి వెంటనే జవాబిచ్చి ఉంటే ఏమి?" అన్నాడు కొంచెం కోపంగా.

ముసలమ్మ ఆయనకు నమస్కరిస్తూ చెప్పింది- "'ఎంత కాలం పడుతుంది?' అని మీరు అడగగానే మీవైపుకు చూశాను స్వామీ- మీరప్పుడు కదలకుండా ఒకేచోట నిలబడి ఉన్నారు. అట్లా నిలబడి ఉంటే ఎంతకాలమైనా ఎక్కడికీ చేరరు. ఒకసారి మీరు నడవటం మొదలెట్టాక గానీ నాకు మీ నడక వేగమూ, మీ పట్టుదలా అర్థం కాలేదు. అట్లా గట్టిగా నడిస్తే రెండు రోజుల్లో వూ-తాయ్ కి చేరుకోవచ్చు కదా అని, చెప్పాను. క్షమించండి" అని. సన్యాసికి ఆమెలో బుద్ధుడు కనిపించాడు!

మనంకూడా, ఎక్కడికైనా చేరుకోవాలంటే ముందడుగులు వేయాల్సిందే. నడకే మొదలు పెట్టకపోతే, ఇక గమ్యం ఎప్పటికీ చేరుకోలేం. అందుకని- ఒక్కొక్క అడుగూ వేస్తూపోదాం! నడుస్తూపోదాం!!

2011 సంవత్సరం అందరికీ సుఖ సంతోషాలనూ, ముందుకు నడిచేందుకు స్ఫూర్తినీ ఇస్తుందని ఆశిస్తూ,

కొత్తపల్లి బృందం



# నీతి చంద్రిక

**15 వ భాగం**


*మూలం: కీ.శే. పరవస్తు చిన్నయసూరి సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

*జరిగిన కథ: కాకి పెట్టిన గుడ్లనన్నిటినీ పాము ఎప్పటికప్పుడు తినేస్తూ ఉంటుంది. నక్క కాకికి 'కొంగ-ఎండ్రి' కథను చెప్పి, 'ఉపాయంతో సాధించలేనిది ఏదీ లేదు- కాబట్టి నువ్వు ఏదైనా ఉపాయం ఆలోచించు' అని సలహా ఇస్తుంది. ఇక చదవండి.. నీతిచంద్రిక 15 వ భాగం..*

యమునా నదికి దగ్గరలోనే 'విలాసధామం' అనే పట్టణం ఒకటి ఉండేది. ఆ పట్టణపు రాజుగారి అంత:పుర స్త్రీలంతా కలిసి, ఒక రోజున విహారం చేయటం కోసం అడవిలోకి వెళ్ళారు. అడవి నిండుగా విరిసిన పూలను చూసి వాళ్ల మనసులు పరవశించాయి. వాళ్ళు చాలాసేపు అక్కడ పూలు కోసుకోవటంలో గడిపి, బాగా అలసిపోయారు.

'ఎక్కడైనా మంచి సరస్సు ఉంటే బాగుండును కదా, జలకాలాడవచ్చు!' అనుకునేసరికి, దగ్గరలోనే అతి

మనోహరంగా ఉన్న సరస్సు ఒకటి వాళ్ళ కంట పడింది. దాంతోవాళ్ళ సంతోషానికి అవధులు లేకుండా పోయాయి.



ఆ వెంటనే వాళ్ళంతా తమ నగలు, ఆభరణాలు అన్నీ తీసి ఒక ప్రక్కన పెట్టారు; ఒకరి చేతులొకరు పట్టుకొని, మెల్లని నడకలతో వయ్యారాలు పోతూ, సున్నితంగా అడుగులు వేయసాగారు; నీళ్ల లోపల మెరుస్తున్న చేపలను చూసి, వాటిని మించుతున్న తమ నెచ్చెలుల శరీర శోభల్ని చూడటం కోసం తమ చూపుల్ని అటూ ఇటూ చలింపజేశారు; అట్లా కొంత బిడియంతో, మరికొంత బెరుకుతో- నీళ్లలోకి దిగారు; ఆపైన వాళ్ళ భయమూ, సిగ్గూ పోయాయి- మించిన ఉత్సాహంతో అందరూ జలక్రీడలు మొదలుపెట్టారు:

వాళ్ళలో ఒకామె దోసిళ్ల నిండా నీళ్ళను తీసుకొని, మరొకామె పైన చల్లింది. ఆమె కిలకిలా నవ్వి, 'ఏదీ, ఆపకుండా వరసగా చల్లు, చూద్దాం!' అని హెచ్చరించింది. వెంటనే మొదటి యువతి నవ్వుతూ జలధారలు కురిపించింది. ఆ తాకిడికి తాళలేక రెండవ యువతి ముఖానికి చేతులు అడ్డు పెట్టుకొని, ముఖం తిప్పుకొని, ఇంకొక చెయ్యెత్తి దండం పెడుతూ- "అమ్మమ్మ! చాలు తల్లీ! నీ జోలికి ఇక రాను. ఆపు ఆపు!" అన్నది.

అంతలో ఇంకొకామె అందుకొని, "అయ్యో, ఇంత పిరికిదానివా?" అన్నది. మరొక యువతి కల్పించుకొని- "అంత చిన్న వాళ్ళతోటి కాదమ్మా, నీ గొప్పదనం నాముందు చూపించు!" అని ఆవేశం కల్పించింది. ఆపైన ఇక ఆమె, మొదటి యువతీ ఒకరి పైన ఒకరు నీళ్ళను

చల్లుకుంటూ, ఒకరిని మించి ఒకరు జలధారలు కురిపిస్తూ, ఆ ధారలలో వెనుదీయక తడుస్తూ జలయుద్ధం మొదలు పెట్టారు. మిగిలిన వాళ్లంతా వాళ్ల చుట్టూ చేరి వారిస్తూ, "చాలు చాలు! ఇదేమి ఆవేశమమ్మా!" అనగా అనగా చివరకు వాళ్ళు యుద్ధం ఆపి, చిరునవ్వులు చిందించే ముఖాలతో, రొప్పుతూ నీళ్ళలో నిలబడ్డారు.

ఆలోగా మరికొందరు ఇద్దరిద్దరుగా జట్లు కట్టి, తమ తమ ఆభరణాలను పందెం వేసుకొని, 'ఎవరు ముందు తీరాన్ని తాకుతారో చూద్దాం!' అని అతి వేగంగా ఈదుతో నీళ్ళను కకలావికలం చేయసాగారు. "అయ్యయ్యో ఎందుకమ్మా ఊరికే నీళ్ళను అతలాకుతలం చేస్తారు?" అని మిగిలినవారు వారిస్తే- "ఆఁ ఏమున్నది, మనల్ని చేరిన'వారి'కి (నీటికి) క్షోభ తప్పదు గదా" అని రెండర్థాలూ స్ఫురించేటట్లు చతుర్లాడుతూనే పోటీని కొనసాగించారు; తీరాన్ని తాకి 'నేను గెలిచాను- నువ్వు ఓడావు'అని నవ్వుతూ, ఓడిన వాళ్లను ఎగతాళి చేస్తూ , వాళ్ళమీదికి జలధారల్ని కురిపిస్తూ, అనేక విధాలుగా సంతోషపడుతూ జలవిహారం చేయసాగారు.



అంతలో ఆ కాకి చప్పుడు చేయకుండా వెళ్ళి, వాళ్ళు అంతకు ముందు సరస్సు ఒడ్డున విడచిన నగలలో బాగా మెరుస్తూ అందం ఒలుకుతూ ఉన్న ఒక పెద్ద హారాన్ని ముక్కున కరచుకొని పారిపోయి, కొంచెం దూరంగా ఒక చెట్టుకొమ్మ మీద కూర్చొని, వాళ్ళలో ఒక యువతి కంట పడ్డది.

అప్పుడు ఆమె చాలా ఆశ్చర్యంతో "ఇదేమి విచిత్రం? రత్న హారాన్ని కాకి

ఎత్తుకెళ్ళింది చూడండి" అని గట్టిగా చెప్పగానే, మిగిలిన వాళ్ళంతా ఒక్కసారిగా తలలెత్తి, కళ్ళన్నీ విప్పారించి కాకి వైపుకు చూసి, ఆశ్చర్యంతో 'ఇదేమి?' అని ముక్కున వేళ్ళు వేసుకున్నారు.

వాళ్ళలో ఒకామె "ఓహోహో! ఎర్రగా మెరుస్తై కదా, పద్మరాగాలు? అవి పొదిగిన హారాన్ని చూసి ఈ వెర్రి కాకి మాంసపు ముక్క అని భ్రమ పడింది కాబోలు!" అన్నది. మరొక యువతి "కాదు కాదు, ఆ నగ దానికి నచ్చి ఉంటుంది- మెడలో వేసుకొని కులుకుదామనుకొని ఉండచ్చు" అని నవ్వి, "నీ ముఖానికి ఈ హారమొక్కటే తక్కువైందా?" అని ఎకసెక్కాలాడింది. "చక్కని హారమమ్మా! ఈ దొంగ కాకి ఎక్కడినుండి వచ్చిందో, దీన్ని ఎక్కడికి తీసుకెళ్ళి పడేస్తుందో, అది ఎవ్వరి పాల బడుతుందో " అని బాధను వ్యక్తం చేస్తూ "అయినా ఏమీ పరవాలేదు- నీళ్లలోనో, అడవిలోనో పడి, ఎవ్వరికీ కాకుండా పోవటం కంటే ఎవరో ఒకరి చేతుల్లో పడటమే మంచిదిలే!" అన్నది మరొకామె.

"పిట్టకు అలంకారాలతో పని ఏమున్నది? దీనికి ఏదో కారణం ఉండి ఉండాలి. నిలకడమీద తెలుస్తుంది" అన్నది ఒక యువతి- ఇలా వాళ్ళంతా ముచ్చటించుకుంటూ ఉండగా, కొందరు పరిచారికలు "ఆ కాకి ఏవైపుకు పోతుందో- ఏమారకుండా జాగ్రత్తగా చూస్తూ ఉండండి" అని అక్కడి ద్వారపాలకులను నియోగించారు. ఆపైన తాము త్వర త్వరగా వెళ్ళి రాజ భవనంలోని మగవారికి ఈ సంగతి చెప్పి, వారినీ వెంట బెట్టుకొని వచ్చారు.



కాకి అంతవరకూ ప్రశాంతంగా అక్కడే

వేచి ఉన్నది; ఇక అందరూ రాగానే అది మెల్లగా పైకి ఎగిరింది. మెల్లగా తన గూడు ఉన్న చెట్టు వైపుకు పయనించింది. తర్వాత, ఆ చెట్టు కొమ్మ మీద కూర్చొని, రాజభటులందరూ చూస్తుండగా, ఆ నగను సూటిగా చెట్టు క్రింద ఉన్న పాము పుట్టలో పడేటట్లు ఎంతో నేర్పుతో జారవిడిచింది. పగడాలు కూర్చిన ఆ హారం ఎర్రగా మెరుస్తూ పాము పుట్టలోకి జారటం అలా రాజభటుల కంట పడగానే, వాళ్లు ఆ పుట్ట చుట్టూ మూగారు. పారలు, గునపాలు మొదలైన సాధనాలను తెప్పించారు. ఆ పుట్టను పెకలించారు.

వెంటనే అందులో ఉన్న త్రాచు పాము కోపంతో విషపు జ్వాలలు చిమ్ముతున్నట్లు బుస కొడుతూ, తన పుట్టను త్రాకిన వాళ్ళ ప్రాణాలు త్రాగేసేందుకా అన్నట్లు నాలుకలు అల్లాడిస్తూ బయటికి దూకి, వాళ్ళ పైన పడేందుకు ప్రయత్నించింది. అప్పుడు ఆ రాజభటులు తమచేతుల్లో ఉన్న దుడ్డు కర్రలతో దాన్ని అదిమి పట్టి చంపారు. అటుపైన వాళ్ళు తీరికగా ఆ పుట్టలో వెతుక్కున్నారు. తమ హారాన్ని తాము తీసుకొని పోయారు.

అట్లా పాము పీడనుండి విముక్తి చెందింది కాకి- అటుపైన చాలా సుఖంగా జీవించింది. కాబట్టి ఉపాయంతో సాధించలేని పని అంటూ ఏదీ లేదు.

చూడు, బుద్ధిబలం ఉన్నవాడికి శారీరక బలం కొంత తక్కువ ఉన్నా పరవాలేదు. కానీ తెలివి లేనివాడికి ఎంత కండ బలం ఉన్నా దాని వల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. చాలా కాలం క్రిందట ఒక కుందేలు తన తెలివిని ఉపయోగించి ఒక సింహాన్నే చంపగల్గింది- నీకు ఆ కథ చెబుతాను, జాగ్రత్తగా విను.

## కుందేలు-సింహం కథ

ఒక అడవిలో 'సత్వసారం' అనే సింహం ఒకటి ఉండేది. అది ఆ అడవిలోని జంతువులను అన్నింటినీ దొరికినవాటిని దొరికినట్లు పట్టుకొని, చంపి తినేస్తుండేది.

దాతో అక్కడి జంతువులన్నీ ఎప్పుడూ విపరీతమైన భయంతో వణికి పోతూ ఉండేవి. అవన్నీ ఒకసారి ఒక చోట చేరి అనేక విధాలుగా ఆలోచించినై. అయినా తమ కష్టాలు తీరే మార్గం కానరాలేదు వాటికి. అందువల్ల అవి 'ప్రస్తుతానికి ఏమి చేద్దాం?' అని ఆలోచించుకున్నాయి. చివరికి అన్నీ కూడబలుక్కొని, ఒక్కసారిగా సింహం దగ్గరికి పోయాయి. బిక్కుబిక్కుమంటూ, ప్రాణాలు అరచేత బట్టుకొని, దూరం దూరంగా నిలబడి, అవన్నీ సింహానికి నమస్కరించాయి.



"ఓ మృగరాజా! మేము అందరమూ తమరికి ఒక విన్నపం చేసుకునేందుకు వచ్చాం. మామీద కనికరం ఉంచి వినండి. తమరి ప్రతాపం ముందు ఈ ప్రపంచంలోని దుష్ట ఏనుగులన్నీ గడ్డిపోచలతో సమానం- ఇక మావంటి అల్పులను లెక్కించవలసిన పని ఏమున్నది? ఏదో దయగలవారు కనుక ఇన్నాళ్ళు ప్రాణాలతో వదిలారు గానీ, లేకపోతే మమ్మల్నందరినీ ఒక్క నిముషంలోచంపగల సమర్థులే, తమరు. అంత కరుణా మూర్తులైన తమ ముందు మా ప్రార్థనలు వృథా కావనే విశ్వాసంతోటే, తమ సమ్ముఖానికి వచ్చేందుకు సాహసించాం. తమరికి ఆహారం అవ్వటంకోసం వంతుల వారీగా రోజుకొక్క జంతువును తమ సన్నిధికి పంపగలం. తమరు దయతో దీనికి అంగీకరించి, మా భయం తొలగించి, మమ్మల్ని కాపాడాలని విన్నపం" అని ప్రార్థించాయి.

అప్పుడా సింహం కొంత మెత్తబడి "సరే, అట్లాగే కానివ్వండి!" అని వాటికి అభయమిచ్చి పంపింది. అటు తర్వాత ఆ జంతువులన్నీ వంతులు వేసుకొని,

రోజుకొక్క జంతువును ఎంపిక చేసుకొని, సింహానికి ఆహారంగా పంపటం మొదలు పెట్టాయి.

ఇట్లా కొంత కాలం గడిచింది. ఒకనాడు ఆ జంతువులన్నీ తమ ఏర్పాటును అనుసరించి, ఒక కుందేలును ఎంపిక చేసి, "రేపు సింహం దగ్గరికి ఆహారంగా పోవటం నీవంతు" అనగానే పాపం, ఆ కుందేలు భయంతో కొంత సేపు మూర్ఛ పోయింది.

ఆపైన అది తెలివి తెచ్చుకొని, చెదిరిన గుండెను రాయి చేసుకొని, "ఎంత వాళ్ళకైనా విధి రాత తప్పదు గదా" అని ఆలోచించింది. వేడి వేడి నిట్టూర్పులు విడుస్తూ, తల విదిల్చి, "ఆపద వాటిల్లినప్పుడు తెలివిని ఉపయోగించి బయటపడే మార్గం ఆలోచించాలి గాని, మబ్బుబారిపోవటం సరైన పద్ధతి కాదు. ఎట్లాగైనా నా తెలివి తేటలను ఉపయోగించి, సింహాన్ని మోసగించి చంపేసేందుకు ప్రయత్నిస్తాను. అటు పైన దేవుడు ఎట్లా నిర్ణయిస్తే అట్లా అవుతుంది" అనుకున్నది.

మరునాడు అది తన బంధువర్గం నుండి తీరికగా శలవు పుచ్చుకున్నది. నడిచేందుకు కాళ్ళు రానట్లే నడిచింది. మెల్ల మెల్లగా పోతూ, తగిన ఉపాయాన్ని ఆలోచించింది. దాన్ని తన మనసులోనే సరిచూసుకున్నది. అటు తర్వాత అది ఇంకొంచెం సేపు అడవిలోనే అటూ ఇటూ తిరిగి, ఆహారపు సమయాన్ని తప్పించింది. ఆపైన మెల్లగా సింహం దగ్గరికి పోయి, దానికి నమస్కరించింది.



దాన్ని చూడగానే సింహానికి కోపం నసాళానికంటింది. దాని జూలు పైకి లేచి నిలబడింది. భయంకరంగా ఉరుములు ఉరిమినట్లు గర్జిస్తూ, మెరుపుల్లాంటి

చూపులతో చూసింది- "అహహా! మేము చూపిన ఓర్పుకు ఫలితం ఎంత బాగున్నది! 'కుడితే తేలు; కుట్టకపోతే కుమ్మరి పురుగు' అంటారు గదా? నాకు ఈ విధంగా వేళ తప్పించి ఆహారం పంపే విధానం చూస్తుంటే, ఈ మృగాలకు నా కోపపు వేడిని మరొక్కసారి చవి చూడాలని కోరిక పుట్టిందనిపిస్తున్నది. ఈ అడవి జంతువులకు ఇంతలోనే ఇంత మత్తా? ఈరోజే ఈ అడవిలో ఉన్న జంతువులన్నింటినీ ఒక్క దెబ్బకు చంపి, మండే నా కడుపుకు ఆహుతి చేస్తాను చూడు!" అని తోకను నేలకు జాడించి, లేచి నిలబడ్డది. (...మిగతాది మళ్ళీ.)

**జోకులు**

**అసలుకు ఎసరు!**

టీచర్: ' నారు పోసినోడే నీరు పోస్తాడు ' అలాంటి సామెత ఇంకొకటి చెప్పరా!

స్టూడెంట్: "పాఠం చెప్పిన వాళ్లే పరీక్ష రాయాలి" టీచర్!

**తెగని బంధం!**

యముడు: పిసినారి పాపయ్యను తీసుకురమ్మంటే, అతని ఇనప్పెట్టెను తెచ్చారేంట్రా?

యమకింకరులు: ఇది లేకుండా అతను రావట్లేదు, ప్రభూ!

*సేకరణ: బి.సౌమ్య*



# సింహం పెళ్ళి

*రచన: ఎస్. చంద్రకళ, 8.వతరగతి, ప్రకృతిబడి.*

అడవికి దగ్గరలో ఒక చిన్న పల్లెటూరు ఉండేది. ఆ పల్లెలో మాధవయ్య అనే పేదవాడు ఒకడు ఉండేవాడు. అతను, అతని భార్య- ఇద్దరూ ప్రతిరోజూ అడవికి పోయి కట్టెలు కొట్టి తెచ్చి, బస్తీలో వాటిని అమ్ముకొని జీవించేవాళ్ళు. వాళ్ళకు ఒక్కతే కూతురు- పేరు విజయ. విజయకు యుక్త వయస్సు వచ్చింది- చాలా అందంగా ఉండేది ఆ అమ్మాయి. రోజులు గడిచేకొద్దీ మాధవయ్యకు విజయ పెళ్ళి గురించిన చింత పట్టుకున్నది. అయితే తెలివిగలవాడు కనుక, సరైన సంబంధం దొరికే వరకూ తొందర పడకూడదనుకున్నాడు.

ఒకసారి మాధవయ్య భార్యకు జబ్బు చేసింది. చాలా రోజులపాటు పని చేయలేకపోయింది ఆమె. అందుచేత,

'పనిలో సాయం ఉంటుంది గదా' అని, విజయను కూడా తనతోబాటు అడవికి పిలుచుకుపోయేవాడు మాధవయ్య.

ఒక రోజున అట్లా వాళ్ళిద్దరూ అడవిలో కట్టెలు కొడుతుండగా- వాళ్ళ దగ్గరికి నడుచుకుంటూ వచ్చింది ఒక సింహం!

దానిని చూసిన మాధవయ్య, విజయలకు పై ప్రాణాలు పైనే పోయిన-ట్లైంది. తప్పించుకుని పారిపోయే మార్గం కనిపించ లేదు. చావు తప్పదనిపించింది; కాళ్ళు నేలకు అతుక్కు పోయాయి. గట్టిగా కళ్ళు మూసుకొని, భయంతో వణికిపోతూ నిలబడ్డారు ఇద్దరూ.

సింహం మెల్లగా వాళ్ళదగ్గరికి వచ్చి నిలబడి, గంభీరంగా అన్నది- "మాధవయ్యా! నీ కూతురు నాకు చాలా నచ్చింది. ఆమెనే పెండ్లి చేసుకోవాలని కోరిక కలిగింది నాకు. కనుక నువ్విప్పుడు ఆమెను నాకిచ్చి పెండ్లి చెయ్యి!" అని.

మాధవయ్యకు మతిపోయినట్లైంది. ఏమంటే ఏం ముంచుకొస్తుందో తెలీదు! అతని మెదడు చురుకుగా పనిచేసింది. ఎట్లాగైనా దీని బారినుండి ఇప్పటికి తప్పించుకుంటే చాలుననుకొని, అతను మర్యాదగా "నా భార్యతో ఆలోచించి చెప్తాను సింహరాజా! నాక్కొంత సమయం ఇవ్వు" అన్నాడు.



'సరే, అయితే రేపు మళ్ళీ కలుస్తాను, ఆలోగా ఆలోచించండి. ఒకవేళ మీ అమ్మాయిని నాకిచ్చి పెళ్ళి చెయ్యకపోతే నేను మిమ్మల్నిద్దరినే కాక, మీ అమ్మాయిని కూడా చప్పరించేస్తాను మరి, చూసుకోండి" అని ఎంచక్కా బెదిరించి వెళ్ళిపోయింది సింహం. అయినా మాధవయ్య

సంతోషంగానే ఊపిరి పీల్చుకున్నాడు: 'మరునాడు అసలు అడవికే వెళ్ళకపోతే సరి' అనుకున్నాడు.



అయితే మరునాడు తెల్లవారి తలుపులు తెరిచే సమయానికి సింహం వాళ్ళ ఇంటి ముందుకొచ్చి నిలబడి ఉన్నది! మాధవయ్య కంగు తిన్నాడు. అది అంతగా గుర్తుపెట్టుకొని ఇంటికి వస్తుందనుకోలేదు అతను. ఇప్పుడేం చేయాలి?

చేసేదేమీ లేక అతను దాన్ని లోనికి ఆహ్వానించి కూర్చోబెట్టి, మర్యాదలు చేశాడు. "మృగరాజా! అమ్మాయిని నీ కిచ్చి వివాహం జరపటానికి అంగీకరిస్తున్నాం. కానీ పెళ్ళి మాత్రం మా ఆచారం ప్రకారం జరగాలి. ఇంకో రెండు షరతులకు గనక నువ్వు అంగీకరిస్తే వెంటనే మీ యిద్దరికీ పెళ్ళి జరిపించేస్తాం!" అన్నాడు.

"మీ ఆచారం ప్రకారమే పెళ్ళి జరపండి. ఆ షరతులేమిటో ముందుగా చెప్పండి" అంది సింహం, దర్పంగా.

"మరేమీ లేదు- అమ్మాయిని పెంచి ఇంత పెద్దదాన్ని చేశాను కదా, నాకు చాలా డబ్బు ఖర్చైంది. అందుచేత ముందుగా నాకు కొంత డబ్బో, దస్కమో ఇవ్వాలి నువ్వు!" అన్నాడు మాధవయ్య.

"ఓహోహో! అదేమంత పెద్ద కోరిక? నా దగ్గరున్నంత బంగారం వేరే ఎవ్వరిదగ్గరా లేదు. నువ్వు మోయలేనంత బంగారం తెచ్చి ఇస్తాను చూడు!" అని తన గుహకు పరుగెత్తింది సింహం. బాటసారుల్ని చంపి తను కూడబెట్టిన ధనరాసుల్లోంచి కొంత బంగారాన్ని ఒక మూట నిండా నింపి పట్టుకొచ్చి మాధవయ్యకి ఇచ్చేసింది:

"రెండవ షరతు ఏమిటో చెప్పు. నాకు పెళ్ళెప్పుడో చెప్పు!" అన్నది, మాధవయ్య గుక్క తిప్పుకునేలోపు.

మాధవయ్య సింహాన్ని బాగా మెచ్చుకొని సంతోషపెట్టి, తన కూతురి వంక చూపుతూ, "ఏమీ లేదు సింహరాజా! విజయకు నీ గోళ్ళు, కోరలు చూస్తే భయంగా ఉందట. తన భర్తకు అంత వాడి గోళ్ళు, అంత పదునైన పళ్ళు ఉంటే తను తట్టుకోలేనంటున్నది. అందుకని, నువ్వు వాటిని కాస్త వదిలించుకొని వచ్చావంటే, వెంటనే నీ పెళ్ళి జరిపిస్తాను- ఇంకే అడ్డంకీ ఉండదు" అన్నాడు.

పెళ్ళిని తలుచుకొని సింహానికి మనసు నిలవలేదు. అయితే గోళ్ళు, కోరలు పీక్కోవటం దానికి చేతకాలేదు.

అది స్వయంగా ఒక పట్టకారును, చాకును తీసుకొచ్చి మాధవయ్యకిచ్చి, తన కోరలు గోళ్ళు పీకి పెట్టమన్నది. "అమ్మో! నాకు భయం! నీకు నొప్పి పుట్టిందంటే నన్నేం చేస్తావో!" అని భయం నటించాడు మాధవయ్య. "ఏమీ పరవాలేదు. నొప్పిని భరిస్తాను- నిన్నేమీ అనను" అని సింహం భరోసా ఇచ్చాక, అతను ముందుకెళ్ళి, దాని గోళ్ళు, కోరలు పీకేశాడు ధైర్యంగా.

పెళ్ళి మోజులో బాధనంతా భరించింది సింహం. దాని మొండితనాన్ని చూసి మాధవయ్యకే కొంచెం సేపు ముచ్చట వేసింది. పని అంతా అయిపోగానే అది "ఊ , ఇక కానివ్వండి! త్వరగా పెళ్ళి జరిపించండి! ఆలస్యంచేశారంటే నేను సింహాన్నని నిరూపిస్తాను- ఆపైన మీ ఇష్టం" అని గర్జిస్తూ అందరినీ తొందరపెట్టింది.

"మా ఆచారం ప్రకారం పెళ్ళి కుమారుడికి ముందుగా బడితెతో పెళ్ళి జరుపుతారు." అని మాధవయ్య, అతని భార్య, కూతురు- ముగ్గురూ మూడు కర్రలు పట్టుకొచ్చి సింహాన్ని ఎడాపెడా బాదారు. అది తిరగబడిందిగానీ, దానికిప్పుడు గోళ్ళు, పళ్ళు లేవు కదా,

అందుకని ఏమీ చేయలేకపోయింది. చివరికి ఆ దెబ్బలు భరించలేక అది అడవిలోకి పారిపోయింది!

అటుపైన సింహం ఇచ్చిన బంగారంతో ఒక పెద్ద వ్యాపారం ప్రారంభించింది విజయ. వాళ్ల దుకాణానికి "మృగరాజా అండ్ కో" అని పేరెందుకు పెట్టుకున్నారో ఎవ్వరికీ తెలీలేదు- మనకు తప్ప!

**రోజుకొక్కడు!** **జోకులు**

టీచర్:- రామూ! మన ముఖ్యమంత్రి ఎవరురా?

రాము:- నిన్నా? మొన్నా? ఈరోజా?

**నువ్వికచాలు!**

సినిమా డైరెక్టర్ :- ఇదిగో నువ్వు పది అంతస్తుల మేడమీదనుండి క్రిందకు దూకాలి.

హీరో:- అమ్మో! నాకేమన్నా అయితే ఎలాగ?


సినిమా డైరెక్టర్ :- ఏమీ కాదులే, ఇది లాస్టు సీను!

**పరవాలేదు!**

తండ్రి:- హలో డాక్టర్ గారు మాకొడుకు పెన్ను మింగాడండి.

డాక్టర్:- పరవాలేదు నేను వచ్చేంతవరకు పెంసిల్ తో రాసుకుంటాడులే.

*సేకరణ: విశ్వనాథ్*



# తోక ఎక్కడుంది?

*Y. సునిల్‌కుమార్, 5,వతరగతి, M.P.P స్కూలు, గడ్డం నాగేపల్లి.*

ఒక అడవిలో పెద్ద మర్రి చెట్టు కింద ఒక ముని తన శిష్యులకు పాఠం చెబుతున్నాడు. శిష్యులు అందరూ శ్రద్ధగా వింటున్నారు. వాళ్లలో ఒకడు మాత్రం అక్కడికి వచ్చిన ఎలుకను ఒకదాన్ని గమనిస్తున్నాడు. అతను చూస్తూండగానే ఆ ఎలుక మర్రిచెట్టు తొర్రలోకి వెళ్ళింది.

గురువుగారి పాఠం కొనసాగుతున్నది. అంతలోనే తొర్రలోంచి బయటికి వచ్చింది ఎలుక. శిష్యుడు దాన్నే చాలా ఆసక్తిగా చూస్తున్నాడు. అంతలోనే ఆ ఎలుక ఎటు వెళ్ళిందోమరి- కనబడలేదు. శిష్యుడు దానికోసం అటూ ఇటూ చూశాడు. ఎంతకీ కనబడలేదది! చివరికి వాడు దాని సంగతి వదిలేసి, పాఠం వినటం మొదలుపెట్టాడు. ఇంతలోనే మళ్ళీ వచ్చింది ఎలుక- ఎక్కడి

నుండి వచ్చిందో మరి! ఈసారీ అది మర్రిచెట్టు తొర్రలోకే వెళ్ళింది. కానీ దాని తోక మాత్రం బయటకు కనబడుతున్నది. శిష్యుడు ఆసక్తిగా చూస్తున్నాడు ఆ తోకనే.

గురువుగారి పాఠం కొనసాగుతున్నది కానీ శిష్యుడు వినటం మాత్రం ఆగిపోయింది. వాడి మనసు అంతా పూర్తిగా ఎలుకతోకతోటే నిండిపోయింది!

అంతలో గురువు గారు అన్నారు గట్టిగా: "ఒరే శిష్యులూ! మీకు ఈ రోజు చెప్పిన పాఠం బాగా అర్థమయిందా?" అని. శిష్యులందరూ "అర్థమైంది గురువర్యా!"అని చెప్పితే , ఈ శిష్యుడు మాత్రం "లేదు గురువర్యా! తోక మాత్రం బయటనే ఉండిపోయింది!" అన్నాడు. నిజమే మరి- తోక లోపలికి పోలేదు గద!

**జోకులు**

**దయ !**

ఒక చీమ పరుగెత్తుతూ పోతా వుంటుంది.

మరొకచీమ: ఎందుకలా పరి గెడు తున్నావు?

మొదటి చీమ: నా ఫ్రెండు ఏనుగుకు యాక్సిడెంట్ అయ్యింది- రక్తం ఇవ్వడానికి వెళ్ళుతున్నాను!

**నేనూ రెడీయే !**

భర్త : టిఫిన్ రెడీ అయిందా?

భార్య : లేదండీ! పదినిమిషాలు ఆగండి- రెడీ అవుతుంది.

భర్త : అయితే పదినిమిషాల్లో నేను హోటల్లో తిని వస్తా!

భార్య: అయితే ఆగండి, నేను రెడీ అయ్యివస్తా!

*సేకరణ: ఓంలత*



# పాము సాయం



*రచన: సి. కృష్ణవేణి, టింబక్టు బడి.*

అనగనగా శ్రీతు అనే ఒక పేద పాప ఉండేది. శ్రీతు మంచి పిల్ల; చాలా తెలివిగలది కూడా. అయితే దురదృష్టం, ఆ పాప ఇంకా పెద్దదవ్వకుండానే వాళ్ల అమ్మ చనిపోయింది. తండ్రి శ్రీహరి కాస్తా రెండవ పెళ్ళి చేసుకున్నాడు. అట్లా శ్రీతుకి సవతి తల్లిగా వచ్చింది సుమిత్ర.

సుమిత్ర అస్సలు మంచిది కాదు. 'ఏ దిక్కూ లేనిది గదా' అని, ఆమెకు శ్రీతుని చూస్తే చాలా చులకన భావం ఉండేది. శ్రీతుని ఆమె చాలా కష్టాలకు గురి చేసేది. బడికి పోనివ్వక, ఏవేవో పనులు చెప్పి సతాయిస్తూఉండేది.

శ్రీహరి ప్రతిరోజూ పొద్దున్నే లేచి, ఆవుల దగ్గరికి వెళ్ళి పాలు పితుక్కొని వచ్చేవాడు. ఒక రోజున ఏదో పని పడి ప్రక్క గ్రామానికి

పోయిన శ్రీహరి సమయానికి వెనక్కి రాలేదు. తెల్లవారగానే సుమిత్ర శ్రీతుని పిలిచి "ఆవుల దగ్గరికి వెళ్ళి పాలు పితుక్కురా, పో" అని పంపించింది.

శ్రీతుకేమో పాలు పితకడం రాదు. అయినా ఆవుల దగ్గరికి వెళ్ళి, వాటిని ప్రేమగా పలకరించి, అతి కష్టం మీద పాలు పితికింది ఆ పాప. నిండిన పాల కడవను ప్రక్కన పెట్టి, వెళ్ళి చేతులు కడుక్కుని వచ్చి చూసేసరికి, ఏముంది?- పాల కడవ కాస్తా ఖాళీ!

"అయ్యో! కడవ నిండుగా పిండిన పాలన్నీ ఏమయ్యాయి? ఇప్పుడు పిన్నమ్మ అడిగితే ఏమని జవాబు చెప్పాలి?" అని ఏడుస్తూ అక్కడే కూర్చున్నది శ్రీతు. ఆ పాప దు:ఖానికి అక్కడున్న ఆవుల గుండెలన్నీ కరిగిపోయాయి. అంతలో అక్కడ నాగుపాము ఒకటి ప్రత్యక్షం అయ్యింది. దాని తలమీద ఒక మణి వెలుగులు చిమ్ముతున్నది. ఆ పాము శ్రీతును స్నేహంగా పలకరించి, "నన్ను చూసి భయపడకు- నీ కడవలోని పాలన్నీ త్రాగింది నేనే- నా ఆకలి తీర్చినందుకు ధన్యవాదాలు" అన్నది.

అప్పుడు శ్రీతు కొంచెం ధైర్యం తెచ్చుకున్నది. "నీకు ఆకలిగా ఉన్నదని పాలన్నీ త్రాగేశావు సరే, మరిప్పుడు నా సంగతి? మా పిన్నమ్మనుండి నన్నెవరు రక్షిస్తారు? వేరేవాళ్ళ వస్తువులు తీసుకునేముందు వాళ్ళకు ఒక మాట చెప్పటం పద్ధతి కదా" అన్నది పాముతో.

అప్పుడు పాము "అయ్యో! అంత ఆలోచించలేదమ్మా! ఆకలికి తట్టుకోలేక, పాలు కనబడగానే త్రాగేశాను. నువు ధైర్యంగా ఇంటికి వెళ్ళు. నీకేమీ కాదులే. మళ్ళీ నీకే తెలుస్తుంది" అని శ్రీతుకు ధైర్యం చెప్పి ఇంట్లోకి పంపించింది.

ఇంక చేసేదేముంది? శ్రీతు ఖాళీ కడవనే ఎత్తుకొని ఇంట్లోకి వెళ్లింది. "పిన్నీ పాలు తెచ్చాను- దేనిలో పోయాలి?" అని అడిగింది సవతి తల్లిని. పనిలో మునిగి

ఉన్న సుమిత్ర "అక్కడ- ఆ పాత్రలో పొయ్యి" అని ఒక గిన్నెను చూపించింది. శ్రీతు అక్కడికి వెళ్ళి ఖాళీ కడవనే బోర్లించింది అందులోకి-

ఆశ్చర్యం! ఆ పాత్ర నిండిపోయింది పాలతో! చూస్తే కడవ అడుగున ఇంకొన్ని పాలు ఉన్నై- అందుకని శ్రీతు మరొక గిన్నెలోకి వంపింది కడవను. ఆ గిన్నె కూడా నిండిపోయింది! చూస్తూ చూస్తూ ఉండగానే అట్లా ఐదు పెద్ద పెద్ద గిన్నెలు పాలతో నిండిపోయాయి!

అంతలోనే "ఏవి, పాలు?" అని వచ్చి చూసిన సుమిత్రకు ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. అన్ని పాలను ఆమె ఏనాడూ కళ్ళ చూసి ఉండలేదు మరి! మరు క్షణంలో ఆమెకు ఆశ హెచ్చయింది. "సరే! పర్లేదు, బాగానే పిండావు. ఇక మీద ప్రతిరోజూ నువ్వే పాలు పితుక్కొని రావాలి" అని ఆజ్ఞ జారీచేసింది.

ఆ విధంగా, అటు తిరిగీ ఇటు తిరిగీ పని ఒత్తిడి మాత్రం శ్రీతు మీదే పడింది. ఆ పాప చేయాల్సిన పనుల జాబితాకు అదనంగా పాలు పిండే పని కూడా చేరుకున్నది. మర్నాటికి శ్రీహరి ఇల్లు చేరుకున్నప్పటికీ, సుమిత్ర మాత్రం అతన్ని పాలు పితకనివ్వలేదు. ప్రతిరోజూ శ్రీతు పాలు పితకటం, పాము వచ్చి పాలు త్రాగటం, ఐదు గిన్నెల నిండా పాలు తయారవ్వటం- ఇలాగే ఒక వారం రోజుల పాటు కొనసాగింది.

ఏడవ రోజున విచారంగా ఉన్న శ్రీతుని అడిగింది పాము "ఎందుకు శ్రీతూ, అట్లా బాధపడుతూ ఉంటావు, నువ్వెప్పుడూ?" అని. శ్రీతుకు ఏడుపు తన్నుకొచ్చింది. ఆ పాప పాముకు తన గోడంతా చెప్పుకున్నది. ఎవరూ లేరని తనను పిన్నమ్మ ఎంత చులకనగా చూస్తుందో చెప్పింది.

"నీ వయసులో పిల్లలందరూ బడికి వెళ్ళాలి కదా, నిన్ను పంపించరా?" అని అడిగింది పాము. "ఊహు" అని అడ్డంగా

తల ఊపింది శ్రీరు.

"నీకు ఇష్టమేనా, బడికి వెళ్ళటం?" అడిగింది పాము. "ఓ, ఎంత ఇష్టమో, చెప్పలేను. చాలా ఇష్టం" అన్నది శ్రీతు.

"అయితే సరే, ఇవాల్టినుండీ నువ్వు బడికి పోతావు, చూస్తూండు" అన్నది పాము.

ఆరోజు కూడా ఎప్పటిలాగానే ఐదు గిన్నెలూ పాలతో నిండాక, శ్రీతు కడవను కడిగి పెట్టేందుకు బయటికి వెళ్ళగానే, సుమిత్ర వెళ్ళి ఆశగా ఐదు గిన్నెల పాలనూ చూసుకున్నది. ఆమె చూస్తూండగానే ఆ పాలన్నీ పాములైపోయాయి! అవన్నీ గిన్నెల్లోంచి బయటికొచ్చి గదిలో ప్రాకటం మొదలు పెట్టే సరికి, పిన్నమ్మ 'కెవ్వు కెవ్వు'మని అరుస్తూ గంతులు వేసింది కొంచెంసేపు.

అంతలో వాటి మధ్యలోంచి తలమీద మణిని ధరించిన నాగ సర్పం లేచి నిలబడింది. "పిన్నమ్మా! మేం అందరం శ్రీతు బంధువులం. నువ్వు ఆ పాపను కష్టపెట్టటం ఎవ్వరూ గమనించట్లేద-నుకుంటున్నావు కదూ? మేం చూస్తూనే ఉన్నాం. శ్రీతును బడికి పంపించట్లేదు; గొడ్డు చాకిరీ చేయిస్తున్నావు; దురాశకొద్దీ పాలు పితికే బరువు కూడా ఆ చిన్ని చేతులమీదే మోపావు. తప్పు కదూ?" అని అడిగింది.

సుమిత్ర పాముకు నమస్కారం పెడుతూ "తప్పు కాయి, నాగన్నా! ఇకమీద శ్రీతును నా బిడ్డలాగా చూసుకుంటాను. ఏ కష్టమూ రానివ్వను. నన్ను నమ్ము" అని కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యింది.

పాము సంతోషంగా తల ఊపి మాయమైపోయింది. అటు తర్వాత సుమిత్ర పూర్తిగా మారిపోయింది. శ్రీతును సొంత బిడ్డకంటే మిన్నగా చూసుకున్నది. శ్రీతు బాగా చదువుకొని, తల్లిదండ్రుల పేరు నిలబెట్టింది.




# పట్నం ఎలుక



*రచన: R. సునిల్, 4 వతరగతి, టింబక్టు బడి.*

అనగా అనగా ఒక పట్నం ఎలుక ఉండేది. ఒక నాడు అది పల్లెలో ఉన్న తన నేస్తం దగ్గరికి వెళ్ళింది.

పల్లె ఎలుక పట్నం ఎలుకకి మర్యాదలు చేసి భోజనం పెట్టింది. పట్నం ఎలుకకి ఆ తిండి నచ్చలేదు. "మిత్రమా! ఈ పల్లెలో ఏం సుఖం ఉంది? ఇదేమి తిండి? పట్నంలోనైతే పిండి వంటలు తినవచ్చు; దర్జాగా బతకవచ్చు. ఒకసారి రుచి చూస్తే నీకే తెలుస్తుంది- నాతో రారాదూ?" అంది.

సరేనని పల్లెటూరి ఎలుక బయలు దేరి పట్నం వెళ్ళింది. ఆ రోజు ఆ ఇంట్లో విందు. పిండి వంటలన్నీ అందంగా పేర్చి ఉన్నారు. వాటిని చూడగానే పల్లె ఎలుక పొంగి పోయింది. "మిత్రమా! ఎంత అదృష్టం చేసుకున్నావోగాని, ఇంత చక్కని ఆహారం

తింటూ గడిపావు నువ్వు" అని పొగిడింది పట్నం ఎలుకను.

పట్నం ఎలుక దర్జాగా దాన్ని ఆ వంటకాల దగ్గరికి తీసుకెళ్ళింది. అంతలోనే ఎవరో లోనికి వస్తున్న అలికిడి అయ్యింది: "మిత్రమా! కలుగులోకి దూరు! ఎవరో వస్తున్నారు!" అంటూ లోనికి పరుగు తీసిందది. పల్లె ఎలుక దాని వెనకనే కలుగులోకి పరుగెత్తింది.

అవి అక్కడి నుండి చూస్తూండగానే ఇద్దరు మనుషులు లోనికి వచ్చి, మెల్లగా భోజనం చేసి వెళ్ళారు. వాళ్ళు వెళ్ళగానే మళ్లీ వంటకాల దగ్గరికి చేరాయి ఎలుకలు. ఇంకా దేన్నీ రుచి చూడనే లేదు- మళ్ళీ అలికిడైంది! ఈసారి ఇంకా ఎక్కువ మంది మనుషులు లోనికి వచ్చారు.

వాళ్లంతా తిని వెళ్ళేంత వరకూ ఎలుకలు కలుగులోంచి బయటికి రాలేకపోయాయి. ఆ సరికి వాటికి ఆకలి దహించుకు- పోతున్నది. గది ఖాళీ అయ్యిందో లేదో- రెండూ బయటికి పరుగెత్తాయి- మిగిలిన వంటకాలు తినేందుకు.

అయితే అంతలోనే కుక్కల అరుపులు వినిపించాయి. రెండు ఎలుకలూ కలుగులోకి దూరాల్సి వచ్చింది మళ్ళీ. ఆ తర్వాత అవి బయటికి వచ్చేసరికి, ఇంటివాళ్ల పిల్లి వాటి వెంటపడి, కిలోమీటరు వరకూ తరిమింది!

పల్లె ఎలుకకి ఆకలి దహించుకు- పోతోంది. చివరికి 'ఎలా అయితేనేం' అని, అక్కడే- రోడ్డు ప్రక్కన- ఉన్న చెత్తకుప్పలో భయం భయంగా భోజనం కానిచ్చాయి, రెండు ఎలుకలూ!

అప్పుడు ఇంటి దారి పడుతూ అన్నది పల్లె ఎలుక- "మిత్రమా! భయపడుతూ పాయసం తినేకంటే ప్రశాంతంగా కూర్చొని మాడిన మెతుకులు తినటమే హాయినిస్తుంది నాకు. మీకూ మీ పట్టణ జీవితానికీ ఒక నమస్కారం. నా వరకూ నా పల్లె చాలు"అని.




# కాకి తెలివి

యస్. రామాంజినమ్మ , 8 వతరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి
సవరణ: కొత్తపల్లి

అనగనగా ఒక అడవిలో ఒక కాకి వుండేది . ఒకసారి అది చుట్టాల ఇంటికి వెళ్ళింది. కొన్ని రోజులు సరదాగా గడిపి, ఇంటికి బయలు దేరింది. కాకులు మామూలుగా ఎక్కువ దూరం పోవు. అయితే ఈ కాకి చాలా దూరం పోయింది గదా, అందుకని దానికి దాహం వేసింది . దగ్గర్లో ఏదైనా చెరువు గాని, కాలువ గాని వున్నదేమోనని వెతికింది. ఎక్కడా నీళ్ళు లేవు! పైపెచ్చు అది ఎండాకాలం- అందుకని చిన్న చిన్న గుంటలన్నీ ఎండిపోయి ఉన్నాయి!

కాకికి ఏం చేయాలో తోచలేదు. గొంతు పిడచ కట్టుకపోతోంది. అలాగే

కొంత సేపు పోయింది గానీ, కొంత సేపటికి ఇక అది ఎగరలేకపోయింది. నేల బారునే వెతుక్కుంటూ వెళ్ళసాగింది. చివరికి ఒక పొలంలో దానికి ఒక సన్న మూతి కూజా కనిపించింది. పొలంలో పని చేస్తున్న రైతు తెచ్చుకున్నట్లున్నాడు దాన్ని.

కాకికి ప్రాణాలు లేచి వచ్చినట్లైంది. గబగబా పరుగెత్తుకొని వెళ్ళి కూజా మీద వాలింది. లోపలికి తొంగి చూసింది: కూజాలో సగం వరకూ ఉన్నై, నీళ్ళు. వాటిని అందుకుందామని ఆశగా వంగింది కాకి.

కానీ ఏంలాభం? అవి దాని ముక్కుకు అందలేదు! 'దగ్గర్లోనే నీళ్ళను పెట్టుకొని కూడా దాహానికి చనిపోతానేమో' అనిపించింది కాకికి. అది ఎన్ని సార్లు కూజా మీదికి ఎగిరి ముక్కును లోనికి దూర్చినా ప్రయోజనం కనిపించలేదు!

'ఎలాగబ్బా' అనుకొంటూ చుట్టూతా కలయ చూసిందది. దగ్గర్లోనే దానికి కొన్ని గులక రాళ్ళు కనిపించాయి. వెంటనే దానికి వాళ్ల అవ్వ చెప్పిన కథ కూడా గుర్తుకొచ్చింది. 'అదే సరైన మార్గం' అనుకున్నది అది- సంతోషంగా ఒక్కొక్క గులకరాయినీ తీసుకొచ్చి కుండలో వేయటం మొదలు పెట్టింది.

అట్లా ఎన్ని రాళ్ళు వేసినా నీళ్ళు మాత్రం పైకి రాలేదు! కావాలంటే మీరూ వేసి చూడండి- అంత సులభంగా పైకి రావు, నీళ్ళు!

కాకి అలోచనలో పడింది: "ఎక్కడో లెక్క తప్పినట్లుంది- ఇప్పుడేం చేయాలి?" అనుకుంది. అంతలో దాని దృష్టి కూజా అడుగు మీద పడింది. నేలమీద మూడు రాళ్ళు పెట్టి, వాటి మీద కూజాను పెట్టుకున్నాడు రైతు: కాకికి వెంటనే ఏం చేయాలో తెలిసిపోయింది! తన కాలి గోళ్ళతో మట్టిని గీకి గీకి- చివరికి ఒక రాయిని వదులు చేసింది. ఆపైన నేర్పుగా ఆ రాయిని బయటికిలాగేసింది!

మరుక్షణం కూజా నేల మీదికి ఒరిగింది- దానిలో ఉన్న నీళ్ళు కొన్ని ఒలికిపోయాయి, మిగిలినవి కాకికి అందాయి!

కాకి వాటిని తాగింది. సంతోషంగా ఎగురుకొని వెళ్ళి పోయింది. పాత కథల్లో చెప్పిన ఉపాయాలు అన్ని వేళలా అక్కరకు రాకపోవచ్చని దానికి అర్థం అయ్యింది!

జోకులు

**ఏవివచ్చు?**

టీచర్ : బాబూ ! రామాయణాన్ని రాసిందెవరు?

విద్యార్థి : తెలియదు టీచర్.

టీచర్: పాండవులలో మధ్యముడి పేరేంటి?

విద్యార్థి : తెలియదు టీచర్.

టీచర్ : రాముడికి సీత ఏమౌతుంది?

విద్యార్థి : తెలియదు టీచర్.

టీచర్ : (కోపంగా) అసలు నీ పేరైనా తెలుసా నీకు?

విద్యార్థి : ఏ వీ రావు టీచర్!

**పోతే పోనియ్**

కావేరి: అక్కా, ఈ రోజు బియ్యంలో రాళ్ళు ఏరడం లేదేంటి.


కీర్తన : ఈ రోజు నేను ఉపవాసం కదా , వంట ఆయనొక్కరికే!

*సేకరణ: B.సౌమ్య*

# జూ!

బొమ్మకు కథ

*రచన: నాగసుధాకర్, ఐదవ తరగతి, అరవింద స్కూల్, విజయవాడ.*




అనగనగా ఒక జంతువులశాల ఉంది. అక్కడ రకరకాల జంతువులు ఉన్నాయి- ఏనుగు, జిరాఫీ మొదలైనవి. అవన్నీ ఒకదానితో ఒకటి చాలా స్నేహంగా ఉంటాయి. ఏ ఒక్కదానికి ఆపద వచ్చినా మిగిలినవన్నీ ఆదుకుంటాయి.

ఒకరోజు ముళ్ళపందికి ఆకలి వేసింది. ఎందుకనో జూ వాళ్ళు దానికి ఆహారం వేయటం మరచి పోయారు. అది అటూ ఇటూ ఎంత తిరిగినా దానికి సరిపోయే ఆహారం దొరకలేదు. అప్పుడు అది అందరినీ పిలిచి, 'నాకు ఆకలి వేస్తోంది- మీ దగ్గర తినేందుకు ఏమైనా ఉన్నాయా?' అని అడిగింది.

"అయ్యో! పాపం, ముళ్ళపందికి ఆకలి వేస్తోందట" అని ఒక్కొక్క జంతువూ తన దగ్గర మిగిలిన ఆహారం తీసుకొచ్చింది. కోతి పచ్చి అరటి కాయలు తెచ్చి ఇచ్చింది. కుందేలు కొన్ని గెన్నుగడ్డలను, బీట్రూటు ముక్కలనూ తెచ్చి ఇచ్చింది. రామచిలుక క్యారట్ ముక్కలు తెచ్చింది. వాటితో ముళ్ళపంది ఆకలి తీర్చుకున్నది. ఇట్లా ఏ ఒక్కరికి కష్టం వచ్చినా మిగిలిన జంతువులన్నీ సాయానికి ముందుకు వచ్చేవి.

ఒక రోజు ఆ జంతువుల శాలను చూసేందుకు ఒక తుంటరి యువకుడు

వచ్చాడు. జంతుశాలలో ఉన్న జంతువులన్నిటినీ వేధించటమే తన పనిగా పెట్టుకున్నాడు వాడు. ఊరికే ఉండక, తాబేలు మీదా, మొసలి మీదా రాళ్ళు వేశాడు. అనుకోకుండా వాడికి దారివెంట వస్తున్న కుందేలు కనబడింది. 'హేయ్! కుందేలూ! ఆగాగు! నిన్ను పట్టుకుపోతా!' అంటూ వాడు దాని వెంట పడ్డాడు. కుందేలుకు పాపం, చాలా భయం వేసింది. అది తొందర తొందరగా పరుగు తీసింది. అయినా ఆ తుంటరి వాడు దాన్ని వదలక వెంబడించాడు.

పరుగు పెడుతున్న కుందేలుకు దారిలో నడచుకుంటూ వస్తున్న ఏనుగు ఎదురైంది. కుందేలు పరుగెడుతూనే దాని దగ్గరికి వెళ్ళి, "ఏనుగూ, కాపాడు! వాడు నన్ను పట్టుకుపోతాడట! కాపాడు!" అని మొత్తుకున్నది.

అప్పుడు ఏనుగు నవ్వి, "నీకేం కాదు. నేనున్నానుగా" అని ధైర్యం చెప్పి, ఆ కుందేలును తొండంతో ఎత్తి తన వీపు పైన కూర్చోబెట్టుకున్నది; కోపంతో ఘీంకరిస్తూ ఆ తుంటరివాడి వైపు అడుగులు వేసింది. అప్పటివరకూ ఏనుగును గమనించని తుంటరివాడు, దాని అరుపును వినగానే భయంతో కంపించిపోయి, మరుక్షణంలో కాలికి బుద్ధి చెప్పాడు.

ఇట్లా ఆ జూలోని జంతువులన్నీ ఒకదాని కష్ట సుఖాలలో ఒకటి పాలు పంచుకుంటూ సంతోషంగా ఉన్నాయి!

**బడి ఉంటుంది!**

**జోకు**

పిల్లవాడు:- అన్నా! ఈ రోజు బడి లేదా అన్నా?

పెద్దవాడు:- పునాది గట్టిదిరా, మనబడి ఎక్కడికీ పోదు- అక్కడే ఉంటుంది.



# జూ!

*రచన: జయలక్ష్మి, ఉపాధ్యాయురాలు, అరవిందస్కూలు, విజయవాడ.*


అది ఒక జంతు సంరక్షణ శాల. అందులో అన్ని జంతువులూ సైజుల వారీగా వేరు వేరు బోనుల్లో ఉన్నాయి. కానీ డైనోసార్, జిరాఫీ, ఏనుగు మాత్రం ఒకేచోట ఉన్నై. జిరాఫీ చెట్టు ఆకులను తినేందుకు ప్రయత్నిస్తోంది.

ఎవరి పనిలో వాళ్ళు ఉన్నారు కానీ, ఒక్క ఏనుగు మాత్రం అసహనంగా అటూ ఇటూ తిరుగుతూ అనుకుంటోంది: "ఈ మానవులకు అస్సలు బుర్రలేదు, బుద్ధి లేదు! ఆకారాన్ని బట్టి, పరిమాణాన్ని బట్టి నన్నూ, డైనోసార్‌ని, ఆ జిరాఫీని ఒక్క బోనులోనే ఉంచారు. జిరాఫీతో ఏదో ఒకలాగా నెట్టుకొని వస్తాను- పోయి పోయి ఈ డైనోసార్‌ని ఇక్కడే ఉంచారు గదా!? కదలాలంటే భయం, అరవాలంటే వణుకు! ఈ వెర్రి జిరాఫీ మాత్రం ఆ కొండ డైనోసార్‌ని

తగిలేలా తిండి కోసం ఎగబడుతోంది. అది ఒక్క పెట్టు పెట్టిందంటే అప్పుడు తెలుస్తుంది- డైనోసారా, మజాకా అని!" అని అనుకుంటూ ఉంది.

ఇంతలోనే జిరాఫీ దాని దగ్గరికి వచ్చి "ఏమిటక్కా! అంత కంగారుగా ఉన్నావు?" అని అడిగింది. ఏనుగు తన కోపాన్ని పంటి బిగువున ఉంచి, "ఏమిటా?! 'ఇద్దరం ఒకేలా ఉన్నాం' అనుకొని, తల్లిలా భావించి ఆ డైనోసార్ దగ్గర కు వెళ్తున్నావు. ఆ డైనోసార్ నీకు సవతి తల్లి- తెలుసా?" అన్నది. ఈ మాటలు విన్నాయి- మిగిలిన జంతువులన్నీ. అవన్నీ నవ్వుకొని, ఏనుగుని ఆట పట్టించాలనుకున్నాయి:

"అదేమిటి పిన్నీ!? నీకు అండగా నేను లేనా? నీకు ఏమైనా అయితే నేను ఊరుకుంటానా?" అంది పాము. ఏనుగుకు చర్రున కోపం వచ్చేసింది: "ఎవరే, నీకు పిన్ని? నీకు నాకు ఉన్న బంధం ఆ శివపూజ నాడే తెగి పోయింది. కావాలంటే ఆ పెంగ్విన్ తో పెట్టుకో" అని అన్నది. వెంటనే పెంగ్విన్ "చాలు-చాల్లేవమ్మా! ఆ పాముకూ, నాకూ స్నేహమా? నీకు వచ్చిన ఆపద సమయంలో నా కు చేతనైన సాయం నేను సొంతగా చేస్తాను" అన్నది. ఆ మాటలతో ఏనుగుకు కోపం, బాధ, నవ్వు ఒకదాని వెంట ఒకటి వస్తూ ఉన్నాయి.




ఇంతలో తాబేలు "నేను లేనామ్మా, ఏనుగూ!? నీ ఆపద సమయంలో నేను నిన్ను ఆదుకుంటానులే, భయపడకు" అన్నది. ఏనుగు ఉడుక్కున్నది. తన బాధను మనసులోనే అదుముకుంటూ "మీరా?! మీరు- నాకు సాయం చేస్తారా?

మిమ్మల్ని కూడా నాతోబాటు ఈ బోనులో పెట్టి ఉంటే తెలిసేది. నా ఇనుప పాదంతో తొక్కి చంపేసేదాన్ని" అన్నది కోపంగా.

దానితో అవతలగా ఉన్న సింహం అందుకొని, "అదేమిటి ఒదినా? నన్ను ఉండనీ, నీ బోనులో! నిన్ను ఆనందంగా ఉంచుతాను!" అన్నది. ఆ మాటలతో ఏనుగుకు ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి. "నువ్వా?!" అని మనసులో అనుకొన్నది: "నువ్వు కలలో వచ్చినా చాలునే, నాకు గుండె పోటు వస్తాది! ఇంక నీ దగ్గరే ఉంటే-?! అమ్మో?" అనుకొని, పైకి మాత్రం "వద్దులే సింహం బాబూ! నేనేమంత పిరికి దానిని కానులే, నా బాగు నేను చూసుకోగలను!" అన్నది.

ఇంతలో కంగారూ, కంగారు-కంగారుగా వచ్చి, "అయ్యో! ఇదేంటి? ఇక్కడ డైనోసార్ ఉందేమిటి?!" అని ఆశ్చర్యంగా అడిగింది.

ఏనుగు ఒక్కసారిగా కళ్ళనీళ్ళు పెట్టుకున్నది. "ఇందాకటినుండీ నా బాధ అదే! ఏ ఒక్కరికీ అర్థం కావడం లేదు- మనమెంత ప్రయాదంలో ఉన్నామో!" అన్నది.

ఇంతలో కోతి, చింపాంజి అరటి పండ్లు నోట్లో కుక్కుకుంటూ "ఆ డైనోసార్‌ని చూసి భయమెందుకు? అది మాకంటే బలమైనదా, ఏమిటి?!" అన్నాయి.

దాంతో ఏనుగు కోపం తారాస్థాయికి చేరుకొన్నది: "నా తొండంతో కొడితేనే మీరు ఒక మైలు దూరంలో పడతారు- ఆ డైనోసార్ కంటే బలమైన వాళ్ళా, మీరు? మీకు తెలుసో తెలీదో- ఆ డైనోసార్ కోట్ల సంవత్సరాల క్రిందట ఈ భూమి మొత్తాన్నీ ఏలింది! ఇప్పుడు అదే మన మధ్యకు చేరుకున్నది! తలచుకున్నదంటే అది మనల్నందరినీ చంపేస్తుంది. మీకు భయం వేయట్లేదా? ఒక్క సారిగా అందరం ఈ 'జూ'ని వదిలి పారిపోదాం - అందరూ సరే అనండి!" అన్నది ఆవేశంగా.

అన్ని జంతువులూ ఒక్కసారిగా గొల్లుమని నవ్వాయి. ఏనుగుకు భయం, కోపం, చికాకు, అసహనం, సిగ్గు- అన్నీ ఒకేసారి ముంచుకొచ్చాయి. "ఎందుకు నవ్వుతున్నారు? ప్రాణాలంటే మీకు మాత్రం తీపి లేదా?" అన్నది.

అప్పుడు జిరాఫీ ఇకిలిస్తూ "అయ్యో, ఏనుగుక్కా! ఇది నిజమైన డైనోసార్ కాదు! బొమ్మ మాత్రమే! లేకపోతే ఇది మనతో పాటు ఆ మనుషుల ప్రాణాల్ని కూడా తీస్తుంది- ఆ సంగతి వాళ్ళకు మాత్రం తెలియదా?!" అన్నది.

దాంతో ఏనుగు హాయిగా ఊపిరి పీల్చుకొన్నది. పైకి మాత్రం బడాయిగా "నా కోసం కాదు చెల్లీ, మీ అందరి కోసమే! అయినా ఇది బొమ్మ డైనోసారా? 'నిజందేమో' అని హడలి చచ్చాను!" అని దాన్ని ముట్టుకొని చూడసాగింది. అన్ని జంతువులూ దాని బడాయి తనాన్ని చూసి మళ్ళీ ఓసారి నవ్వుకున్నాయి.

**జోకులు**

**నెలలు-నేలలు**

సోషల్‌మాష్టారు: ఏమ్మా! నేలలు ఎన్ని రకాలు అవి ఏవో చెప్పు?


అమ్మాయి: నెలలు 12. అవి జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే...

**ఎవరు అవసరం?**

సభ అధ్యక్షులు: మహిళ వంట చేయటానికి ముఖ్యంగా ఏం కావాలి?

మహిళలు: మహిళ వంట చేయటానికి ముఖ్యంగా భర్త ఉండాలి.

*సేకరణ:G. నాగవేణి*



# చిన్నపాప-తేలుబొమ్మ

*రచన: నారాయణ, కొత్తపల్లి బృందం.*

ఒక ఊరిలో ఒక పాప ఉండేది.




ఆ పాప పేరు సీత.

సీత చాలా మంచి పాప.




అమ్మకు చాలా సాయం చేసేది.


నాన్నకు బొమ్మలు గీసేది.



ఒకసారి నాన్న ఒక తేలు బొమ్మ గీశాడు.

సీత ఆ బొమ్మకు రంగులు వేసింది.





అంతలో ఆ బొమ్మ కదిలింది!


కదిలి ముందుకు నడిచింది!

సీతకు భయం వేసింది.

"ఓ నాన్నో!" అని అరిచింది, లేచి నిలబడి.

నాన్న పరుగున వచ్చాడు. " ఏమైంది ఏమైంది?" అని అడిగాడు.


"ఈ తేలు బాగా లేదు- కుడుతుంది" అని ఏడిచింది సీత.



నాన్నకు తన తప్పు అర్థమైంది.

"ఓస్, దానిదేముంది? చీపురుతో ఊడ్చేస్తే సరి!" అన్నాడు తేలికగా.


" మరి చీపురేది?" అడిగింది సీత .



"ఇదిగో!" అని నాన్న చీపిరిని గీశాడు.

"మరి ఊడ్చేదెట్లాగ?" అన్నది సీత.

నాన్న చెయ్యడ్డం పెట్టి రబ్బరుతో తేలుని ఊడ్చేశాడు. ఇప్పుడు చూస్తే అసలు అక్కడ తేలే లేదు!



సీత నవ్వింది- నాన్న చేసిన మాయ పాపకు తెలిసిపోయింది. "ఈ చీపిరితోనైతే దేన్నైనా ఊడ్చేయచ్చు!" అన్నది సంతోషంగా నవ్వుతూ.

**జోకులు**

**ప్రయత్నం!**

తండ్రి : లెక్కల్లో ఇంకాఎక్కువ మార్కులు సాధించడానికి ప్రయత్నించలేక పోయావా?

కొడుకు : ప్రయత్నిద్దామనుకున్నాను డాడీ! కానీ మా లెక్కల టీచర్ పేపర్లన్నీ బీరువాలో పెట్టి తాళం వేస్తుంటుంది!

**మంచి పిల్లవాడు!**

తల్లి : లైబ్రరీకి వెళ్ళినవాడివి కథల పుస్తకం తెచ్చుకోక, 'పిల్లల పెంపకం' పుస్తకం తెచ్చావేమిట్రా?

కొడుకు : నన్ను సరైన పద్ధతిలో పెంచుతున్నావో లేదో చూడడానికి మమ్మీ.




# పరివర్తన

*రచన: శ్రీమతి V.నాగలక్ష్మి, ఉపాధ్యాయురాలు, కెయస్ఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, అనంతపురం.*

అనగా అనగా ఒక రాజ్యం ఉండేది. దాని పేరు కీరరాజ్యం. కీర రాజ్యానికి రాజు రామలింగరాజు. ఆ రాజుగారికి పొగడ్తలు అంటే చాలా ఇష్టం. పొగడ్తలు వింటూ పొద్దు పుచ్చేవాడు. పొగిడేవాళ్ళు ఏం చెబితే అది నమ్మేవాడు. ప్రజల కష్ట సుఖాలను సొంతగా కనుక్కునేవాడు కాదు.

కీరరాజ్యంలోని బ్రాహ్మణుల్లో చాలా తెలివైన వాడు ఒకడు ఉండేవాడు. అతని పేరు సుబ్బావధాని. ఆనాటి రాజులకు పొగడ్తల పిచ్చి ఉందని అతను చాలా త్వరగా గ్రహించాడు. అందుకని అతను పనిగట్టుకొని చాలా రాజ్యాలకు పోయేవాడు. అక్కడి రాజులను ఇంద్రుడనీ, చంద్రుడనీ పొగిడే వాడు. ఆ

వెర్రి రాజులందరూ ఉబ్బి తబ్బిబ్బై అతని మీద ధనరాసులు క్రుమ్మరించేవాళ్ళు. ఆ విధంగా అతను చాలా డబ్బులు సంపాదించాడు.

కీర రాజ్యపు రామలింగరాజు పొగడ్తల పిచ్చి తెలీనిదెవ్వరికి? సుబ్బావధాని టోపీ వేసే రాజుల్లో మొదట నిల్చేది ఆయనే. అవధానిగారు సంవత్సరానికొకసారి దర్బారుకు వెళ్ళేవారు. ఇంతకు ముందు ఎవ్వరూ పొగడని విధంగా పొగిడేవారు రాజుగారిని. రాజుగారు మెచ్చి అతనికి అక్షర లక్షలు ఇచ్చేవారు.

ఈ సంవత్సరం సుబ్బావధానిగారు కీరరాజ్యపు దర్బారుకు వెళ్ళినప్పుడు రాజుగారి తెలివితేటల్ని మహా పొగిడాడు. ఆయన తెలివితేటలకు సాటి రాగలవారు ఈ భూమిమీదే కాదు- సమస్త విశ్వం లోనే ఎవ్వరూ లేరన్నాడు. అంత తెలివిగా ఏలే రాజు ఉన్నాడు గనకనే ప్రజలు చాలా సుఖంగా ఉన్నారని ప్రశంసించాడు. మీ తెలివితేటలకు దేవతలు కూడా అసూయ పడుతున్నారన్నాడు. సుబ్బావధాని పొగడ్తలకు రాజుగారికి ఒళ్ళు పులకరించి పోయింది. అవధానిగారికి తగినట్లు ఏదైనా తెలివైన బహుమతి ఇద్దామనుకున్నాడాయన. మరేమివ్వాలి?

ఒక గుమ్మడి కాయను జాగ్రత్తగా తొలిపించి, దానిలో అతి విలువైన వజ్రాలు, వైఢూర్యాలు, మాణిక్యాలు, అన్నీ పెట్టించాడు. అద్భుత నైపుణ్యంతో ఆ గుమ్మడి కాయను యధావిధిగా అతికింపజేశాడు. ఆ గుమ్మడికాయను సుబ్బావధానికి బహూకరించాడు.

సుబ్బావధానికి చాలా చిన్నతనం అనిపించింది. 'తను అంతగా పొగిడినా రాజుగారు ఒక గుమ్మడికాయను ఇచ్చి చేతులు దులుపుకున్నారే' అని అతనికి దు:ఖం వేసింది. ఎందరో రాజుల సన్మానాలందిన తాను, ఓ మామూలు గుమ్మడికాయను ఇంటికి ఎలా తీసుకు వెళ్ళాలి?' అని అతను ఆ గుమ్మడికాయను అక్కడే ద్వారం ప్రక్కన వదిలి పెట్టేశాడు.

నిరాశగా ఇల్లు చేరుకున్నాడు.

కీర రాజ్యంలోనే 'సత్య వ్రతుడు' అనే ఇంకో బ్రాహ్మణుడు ఉండేవాడు. సత్యవ్రతుడు నీతివంతుడు. కానీ చాలా పేదవాడు. తన శిష్యులకు శాస్త్రవిద్యలతోబాటు మంచి ప్రవర్తన ఎలా ఉండాలో కూడా నేర్పించేవాడు ఆయన. రాజ్యంలో ప్రజలు అసౌకర్యాలతో కష్టపడుతుండటం చూసి ఆయన ఊరుకోలేకపోయాడు. ఒక రోజున ఆయన పనిగట్టుకొని రామలింగరాజు దగ్గరికి వెళ్ళి, "రాజా! కీర రాజ్యంలోని ప్రజలు నానా బాధలకూ లోనౌతున్నారు. వారి అగచాట్లు పట్టించుకొనవలసిన మీరు, పొగడ్తలకు బానిస అని జనశృతి. పొగిడేవారిని ప్రక్కన పెట్టి, వాస్తవాలను స్వయంగా తెలుసుకోండి. రాజ్యంలో పర్యటించండి. దేశాన్ని కాపాడండి" అని హితవు చెప్పాడు.

రాజుకు చాలా కోపం వచ్చింది. సత్యవ్రతుడిని చీవాట్లు పెట్టి, సభాముఖంగా అవమానించాడు. ద్వారపాలకుడిని పిలిచి, 'ఈ బ్రాహ్మణుడిని బయటికి గెంట'మన్నాడు.

నిజాన్ని నిర్భయంగా పలికిన సత్రవ్రతుడంటే గౌరవభావం కలిగింది ఆ ద్వారపాలకుడికి. అతను సత్య వ్రతుడిని బయటికి తీసుకెళ్ళి నమస్కరించి, "స్వామీ, మీ మాటల్లోని వాస్తవాన్ని రాజుగారు గుర్తించలేదు గానీ, నాబోటి సామాన్యులెవ్వరం గుర్తించకుండా ఉండలేము. చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లు, మీ మాటలు రాజుగారి ముందు వృధా అయ్యాయి. బాధపడకండి. నిర్భయంగా నిజం చెప్పిన మీకు సన్మానం చేసేంత గొప్పవాడిని కాదుగానీ, ఏదో భక్తి కొద్దీ సమర్పించుకుంటున్నాను, ఈచిన్న బహుమతిని- కాదనకుండా స్వీకరించండి-" అని సుబ్బావధాని వదిలేసిన గుమ్మడి కాయను ఆయనకు ఇచ్చాడు.



సత్యవ్రతుడు అతన్ని ఆశీర్వదించి, ఇంటికి వెళ్ళి, భార్య చేతికి గుమ్మడికాయ ఇచ్చి కూర వండమన్నాడు. ఆవిడ దాన్ని కోయగానే వజ్రాలు, వైఢూర్యాలు, మణులు, మాణిక్యాలు అన్నీ జలజలా రాలాయి!

వాటిని చూసి సత్యవ్రతుడి భార్య చాలా సంతోషపడ్డది. అయితే ఆ విషయాన్ని చెప్పగానే సత్యవ్రతుడు వాటినన్నిటినీ పట్టుకొని రాజ భవనానికి బయలుదేరాడు. "తనకు ఆ బహుమతిని ఇచ్చిన ద్వారపాలకుడికే అవన్నీ చెందుతాయి" అని ఆయనకు గట్టిగా తోచింది.

అయితే ద్వారపాలకుడు వాటిని తీసుకునేందుకు ససేమిరా అంగీకరించలేదు. "నేను ఒకసారి బహుమతిగా ఇచ్చేశాక అది మీదే" అన్నాడు.

సత్యవ్రతుడు బలవంతం చేసేసరికి అతను "అసలు ఆ గుమ్మడికాయ నేను పండించింది కాదు. అందువల్ల అది నాది కాదు. ఆ కాయను తిరస్కరించి, అక్కడే పడేసి వెళ్ళాడు సుబ్బావధాని. అందుకని అది సుబ్బావధానికి చెందదు. దాన్ని ఆయనకు రాజుగారు బహుమానంగా ఇచ్చారు; అందువల్ల ఇప్పుడది రాజుగారిదీ కాదు- కనుక దాని మీద సర్వ హక్కులూ మీవే" అన్నాడతను.

ఈ గొడవంతా విన్నారు రాజుగారు. అంత సంపదనూ వెనక్కి తీసుకొచ్చిన సత్యవ్రతుడి నిజాయితీ ఆయనకు నచ్చింది. దాన్ని తిరస్కరించిన తన ద్వారపాలకుడి మంచితనమూ, అందుకై అతను చూపిన కారణాల వెనుక గల

తార్కికశక్తీ ఆయనను మురిపించాయి. ఆయన వాళ్ళిద్దరినీ పిలిపించి మర్యాదగా కూర్చోబెట్టి, ఆ సంపద యావత్తూ సత్యవ్రతుడిదేనని తీర్పునిచ్చారు. భయంలేకుండా రాజ్యపు స్థితిని తన దృష్టికి తెచ్చేందుకు ప్రయత్నించినందుకు ఆయనను మరోసారి సత్కరించారు. ద్వారపాలకుడిని తన ప్రధాన సలహాదారుగా నియమించుకున్నారు. ఆనాటినుండీ ఆయన తన నైజాన్ని మార్చుకున్నాడు. పొగడ్తలకు లొంగక, రాజ్యపరిస్థితులను స్వయంగా తెలుసుకుంటూ చక్కని రాజుగా పేరుగాంచాడు.

**జోకులు**

**తెలుసా, తెలీదా?**

టీచర్: ఒరేయ్ సోమూ! రెండు మూళ్ళు ఎంతరా?

సోము: ఆ మాత్రం తెలీదా మేడమ్?

టీచర్ : నాకు తెలుసులేరా, నువ్వు చెప్పు!

సోము: మీకు తెలిస్తే నన్నెందుకు అడుగుతారు, ఊరుకోండి మేడమ్!

**శోకుడు!**

టీచర్: అశోకుడు రోడ్డుకు ఇరువైపులా చెట్లను నాటించెను ఎందుకు?

రాము: రోడ్డు మధ్యలో నాటిస్తే వచ్చిపోయే వాహనాలకు అడ్డం అని.

*సేకరణ: B.విశ్వనాథ్*



# ఎన్నిరోజులు?

*మూలం: పర్తాప్ అగర్వాల్.*

*తెలుగు అనుసరణ: నారాయణ.*

గంగా నదిలో పడవ నడిపిస్తారు సుబ్బన్న, సుబ్బన్న కొడుకు రాముడు. తరతరాలుగా వాళ్ల కుటుంబానిది అదే వృత్తి. పడవలో ప్రయాణీకుల్ని, సామాన్లనీ అన్నిటినీ ఒక ఊరునుండి ఒక ఊరికి చేరుస్తుంటారు వాళ్లు.

ఒకసారి వాళ్ళు ఇద్దరూ పడవ నిండుగా సామాన్లు వేసుకొని పోతున్నారు. ప్రవాహానికి ఎదురుగా సాగుతున్నది ప్రయాణం. తెడ్డు వేయటం చాలా కష్టంగా ఉంది.

తండ్రి కొడుకులు ఇద్దరూ బలమైన వాళ్లే -కండలు తిరిగిన వాళ్లే. అయినా చాలా గంటల పాటు తెడ్డు వేసీ వేసీ అలసి పోయారు ఇద్దరూ. చేతులు బాగా నొప్పి పెడుతున్నాయి. అంతలో ఒక రేవు-

పట్టణం వచ్చింది. రేవులో పడవను ఆపుకొని, ఇద్దరూ కొంచెం సేదతీరారు. రాముడు ఊళ్ళోకి వెళ్లి డజను కమలా పండ్లు కొనుక్కొచ్చాడు, ప్రయాణం మొదలు పెట్టారు మళ్ళీ. రాముడు తెడ్డు వేస్తూండగా తండ్రి విశ్రాంతిగా కూర్చుని తన వంతుగా వచ్చిన ఆరు పండ్లూ తినేశాడు- అయినా ఇంకా కడుపు నిండినట్లు లేదు: ఇంకొకటి తిందామని-పించింది! కానీ ఎట్లాగ? ఒక చిన్న ఉపాయం తట్టింది.

"ఏమో ఇంకా ఎన్నిరోజులు బతుకుతానో, ఏమో!" అని మూలిగాడు గట్టిగా, కొడుక్కి వినబడేట్లు. ఆ పైన కొడుకు వాటాలోంచి ఒక పండును తీసుకొని తినేసాడు.

రాముడికి తండ్రి చేసిన పని నచ్చలేదు- అయినా ఏమీ అనలేదు; ఊరుకున్నాడు. తర్వాత సుబ్బన్న వచ్చి తెడ్డునందుకున్నాడు. ఇప్పుడు పండ్లు తినటం రాముడి వంతు. రాముడు చాలా మెల్లగా తిన్నాడు - ఒక్కో తొననూ చప్పరించుకుంటూ. తినటం పూర్తి కాగానే పడవకు చేరగిలబడి, ప్రశాంతంగా కళ్లు మూసుకున్నాడు.

సుబ్బన్నకు ఒక్కడికే తెడ్డు వేయటం కష్టంగా ఉంది. పిలవకపోతే కొడుకు వచ్చేట్లు లేదు! చివరికి ఉండ బట్టలేక అరిచాడు , ' ఒరేయ్ రాముడూ! రా రా, ఇంక ! నేనొక్కడినే తెడ్డు వేయలేను, చేతులు నొప్పిపెడున్నై...రారా! అని.

రాముడు బదులిచ్చాడు కూర్చొనే- "తెడ్డు నువ్వే వెయ్యి నాన్నా! ఏమో ?! ఇంకా ఎన్నిరోజులు బతుకుతావో, ఏమో? ఎవరికెరుక?!" అని!



# జాబిలి తునక

**పెద్ద కథ**

*ఆంగ్లమూలం: మర్జాట కురునియ్యేమి*
*తెలుగుఅనువాదం: కైపా సతీష్, టింబక్టు కలెక్టివ్, చెన్నేకొత్తపల్లి.*



ఒకానొక సమయంలో, చక్కనైన పట్టులాంటి వెంట్రుకలతో ముచ్చటగొలిపే ఒక చిన్నారి ఫెయిరీ పాప ఉండేది. అందమైన ఎర్రటి ఆంగో బెర్రీ కాయలు, నీలిరంగు కాట్ పువ్వులు కలిగిన ఒక పురాతనమైన చెట్టు తొర్రలో ఆ ఫెయిరీ ఒంటరిగా నివసిస్తుండేది. అంత చక్కనైన స్థలంలో ఉంటున్నప్పటికీ, చిన్ని ఫెయిరీకి ఎందుకనో- సంతోషం లేకుండింది. ఏదో తక్కువైనట్లు, దేన్నో కోల్పోయినట్లు అనిపించేది. కానీ అది ఏంటో మాత్రం అర్థం అయ్యేది కాదు. ఎందుకంటే ఆ ఫెయిరీ ఇంకా చిన్నది మరి! జ్ఞానం కూడా తక్కువే కద, అందుకని!

ఒక రోజు రాత్రి ఆ చిన్నారి ఫెయిరీ

అడవిలో నడుస్తోంది. నడుస్తుంటే, అకస్మాత్తుగా నేలమీద ఆమెకు ఒక జాబిలి తునక కనిపించింది. దాన్ని వెంటనే ఇంటికి తీసుకెళ్ళి పరిశీలించడం మెదలు పెట్టింది ఆ పాప. మిరుమిట్లు గొలుపుతున్న దాని అందాన్ని చూస్తుంటే ఇప్పుడు అందులో ఒక అద్భుత దృశ్యం ప్రత్యక్షమైంది: చెట్టు ఊడలు, దాని క్రింద రెండు నీలి చెర్రీ పండ్లు- వాటి మధ్యగా ఎర్రటి కోన్ ఫ్లవర్, ఇంకా వీటి క్రింద ఎర్రటి రంధ్రం ఒకటి! ఆశ్చర్యంతో చిన్నారి ఫెయిరీ ఆ జాబిలి తునకను ఇటూ అటూ తిప్పసాగింది. తిప్పుతున్నకొద్దీ అందులో దృశ్యం కూడా మారుతోంది! చెట్టు ఊడల మధ్యలోంచి రెండు బుజ్జి బుజ్జి ఆకులు బయటకు వస్తున్నట్టు కనిపించింది ఇప్పుడు! 'అరే! ఎంతటి వింత దృశ్యం' అనుకొనిందిఫెయిరీ పాప.

వయసైన, తెలివైన గుడ్లగూబ ఒకటి అప్పుడే వచ్చి వాలింది ఆ చెట్టు మొదట్లో . అది ఆ చిన్నారి ఫెయిరీని చూసి, "నీ చేతిలో ఏముంది?" అని ఉత్సాహంగా అడిగింది. ఏవైనా కొత్తవి కనిపిస్తే వెంటనే తెలుసుకోవాలని ఆత్రం గుడ్లగూబలకు . అందుకే, అవి చాలా తెలివైనవి మరి.



"ఇందులో కదిలే దృశ్యం ఉంది" అని ఫెయిరీ జవాబిచ్చింది. "ఓహో! ఎట్లాంటి దృశ్యం ఉంది ఇందులో?" అని గుడ్లగూబ అడిగింది. "ఇందులో చెట్టు ఊడలు, రెండు నీలి చెర్రీ పండ్లు, ఎర్రటి పొడవైన...." అని మొత్తం చెప్పింది ఫెయిరీ. "ఓహ్! ఓహ్! నాకివ్వవా ఓ సారి, నేనూ చూసి ఇస్తాను!" అని ప్రాధేయపడింది గుడ్లగూబ. "దానిదేముంది, ఇదిగో తీసుకో- చూడు, ఎంత చక్కని దృశ్యమో!" అని ఫెయిరీ జాబిలి తునకను దానికి ఇచ్చింది.

గుడ్లగూబ దాన్ని పరీక్షించి "అరె! ఇందులో ఉండేది గుడ్లగూబ కదా?" అన్నది. తర్వాత కొంచెం ఆలోచించి "ఆఁ! కాదు! నాకర్థమయ్యింది ఇప్పుడు! ఇది ఒక అద్దం!" అని చెప్పింది. కానీ చిన్నారి ఫెయిరీకి ఏమీ అర్థం కాలేదు. "ఈ జాబిలి తునక ప్రతిబింబాన్ని చూపిస్తుంది. ఇందులో మన రూపాన్ని చూసుకోవచ్చు" అని చెప్పింది గుడ్లగూబ. అయినా ఆ ఫెయిరీకి ఆశ్చర్యం వేసింది తప్ప, పెద్దగా అర్థం కాలేదు: "ఏమిటీ? నేనట్లా ఉంటానా? అయితే ఆ నీలి రంగు పండ్లు ఏమిటి? పొడుగైన ఆకులాంటిది ఏమిటి? మిగిలినవన్నీ ఏమిటి?' అని ఆ పాప గుడ్లగూబను అడిగింది. 'అవి నీ కళ్లు , ముక్కు, చెవులు, నోరు- అంతా కలసి నీ మొఖమే కదా!' చెప్పింది గుడ్లగూబ నవ్వుతూ.

చిన్నారి ఫెయిరీ తన ప్రతిబింబాన్ని దీక్షగా , తదేకంగా చూసింది చాలా సేపు . ఆ చిన్నారి మనసంతా అలజడి- ఎన్నో ప్రశ్నలు తలెత్త సాగాయి. చిన్నారి ఫెయిరీకి తనెలా ఉంటుందో మొదటి సారిగా తెలిసింది- కానీ ఇప్పుడు ఆ పాపకు ఒంటరితనం అనుభవంలోకి వచ్చింది. అరచేతితో తన ఎదపై తడిమింది- అందులో ఏదో అద్భుతమైనది ఉన్నట్టు అనిపించింది. -జాబిలి తునకలో కనబడనిది- కానీ తనకు మాత్రం అనిపిస్తున్నది! చిన్నగా.. లోపల..కొట్టుకుంటున్నట్లు...ఏదో స్పందన.

"చూడు చిన్నారీ! కళ్ళు, చెవులు, ముక్కు- ఇవన్నీ కలిపి నువ్వే! నీకు ఆశ్చర్యంగా ఉందా, ఈ సంగతి తెలిసి?" అని అడిగింది గుడ్లగూబ.

"అవును! ఆశ్చర్యంగాఉంది. వీటితో నేను ఏమి చేయాలో తెలియట్లేదు" అని చిన్నారి ఫెయిరీ బదులిచ్చింది. ఈ సారి ఆశ్చర్యపోవడం గుడ్లగూబ వంతయింది: "నీ కళ్ళు, ముక్కు, నోరు- వీటితో ఏమి చెయ్యాలో తెలీదా?" అంది ఆశ్చర్యపోతూ.



అందుకు చిన్నారి ఫెయిరీ "అవును- నాకు ఎట్లా తెలుస్తుంది? నేనేమో చిన్న ఫెయిరీని. ఇక్కడేమో అంతా చిత్రంగా ఉంది. కానీ అన్నిటికంటే చిత్రమైనది ఏంటో చెప్పనా? నాలోపల ఏదో చిన్నగా కొట్టుకుంటోంది! అదే అన్నిటికంటే చిత్రం. కాసేపు నిండుగా, మరి కాసేపు ఖాళీగా ఉన్నట్టుంటోంది అది. ఎందుకో నాకైతే తెలియటం లేదు గానీ, కాస్త ఇబ్బందిగానే ఉన్నట్లుంది దానితో" అన్నది.

'అయ్యో నా బుజ్జీ! ఇంత అమాయకంగా ఉంటే ఎలాగ?" అని ఆ తెలివైన ముసలి గుడ్లగూబ తల ఊపుతూ అన్నది.

"కానీ నువ్వేమో పెద్దదానివి, చాలా సంగతులు తెలిసిన దానివి కదా, నాకు వివరించి చెప్పవా అని ప్రాధేయపడింది ఫెయిరీ. ఆ ముసలి గుబ్లగూబ కాసేపు ఆలోచించి, నిదానంగా "నేనొకటి చెప్తాను విను! ఇవన్నీ మెల్లగా నీఅంతట నువ్వే, అనుభవపూర్వకంగా తెలుసుకొంటావు. అట్లా తెలుసుకోవటమే సరైనది" అన్నది. "సరే, కానీలే! అనుభవపూర్వకంగా ఎలా నేర్చుకోనేది, అదైనా చెప్పు" అని అడిగింది ఫెయిరీ.

"వెళ్ళు- నడుస్తూ అడవిలోకి వెళ్ళు. ఆ పచ్చని అరణ్యంలోకి వెళ్ళిరా. నువ్వు నేర్చుకొన్నది ఏంటో నాకు వచ్చి చెప్పు . అంత వరకూ సెలవు " అని ఆ గుడ్లగూబ రెక్కలు విప్పుకొని గాలిలోకి ఎగరబోయింది. "ఆగాగు! అన్నింటి కంటే చిత్రమైనది ఏదో నీకు తెలుసుకదా, ఆ ఒక్కటీ చెప్పేసి వెళ్ళు!" అని అరిచింది ఫెయిరీ, దానికి వినబడేటట్లు. "నీ లోపల ఏదైతే కదలాడుతున్నదో, అదే అతి

ముఖ్యం!" అంటూ ఆ గుడ్లగూబ కీకారణ్యంలోకి ఎగిరిపోయింది.

ఇక చేసేదేమీ లేక, గుడ్లగూబ చెప్పిన విధంగానే చిన్నారి ఫెయిరీ అడవిలో నడవటం మొదలు పెట్టింది. ఆ బుజ్జి ఫెయిరీ ఇల్లు ఒక పెద్ద కొండ లోయలో ఉండేది. అయినా ఇంత వరకూ ఎన్నడూ ఆ కొండ ఎక్కే ధైర్యం చేయలేదు ఫెయిరీ. కానీ ఇప్పుడు ఆ కొండను ఎక్కి చూడాలని నిశ్చయించుకొంది. ఆ కొండ నిండా చెట్లు, పొదలు, రాళ్ళు, బండలు- ఎక్కడానికి చాలా కష్టంగా ఉన్నప్పటికీ, ఫెయిరీ వాటన్నిటినీ దాటుకొంటూ, ఏటవాలు బండలను ఎక్కుతూ, చివరికి - ఎలాగైతేనేమి- కొండ పైకి చేరుకొంది.

ఫెయిరీ పాప కొండ కొనను చేరుకునేటప్పటికి రాత్రి అయిపో-వచ్చింది. తెల్లవారు జాము అవుతున్నది. చంద్రుడు, చుక్కలు వెళ్ళి పోతున్నాయి- ఒకదాని తర్వాత ఒకటిగా. అంతలో తొలి ప్రొద్దు పొడిచింది- ఆకాశం అంచు నారింజ రంగులోకి వచ్చింది!



అంతలో అదేంటో తెలియని ఒక అద్భుతమైన నీలికాంతితో అడవంతా నిండిపోయింది! అటువంటి సుమనోహర సమయంలో, సరస్సుల పైన మంచు వీడుతుండగా, సూర్యుడు ఉదయిం-చాడు! వెలుతురుతో రంగులు నింపసాగాడు. ఆకులు-చిగుర్ల పచ్చదనం, సరస్సుల్లోను-నదులలోను నీలిదనం, వివిధ పరిమళ పుష్పాల వైవిధ్యమైన వర్ణాలతో కొండంతా నిండిపోయింది!

ఈ సుందర దృశ్యాన్ని కొండ పై నుంచి చూసి పరవశించిపోయింది చిన్నారి ఫెయిరీ. ఓ సారి కళ్ళు మూసి, మళ్ళీ తెరిచి- అలాగే

చూస్తూ ఉండిపోయింది. అప్పుడు ఆమెకు ఇలా అనిపించింది- "కళ్ళతో ఏం చేయాలో ఇప్పుడు తెలిసింది! వాటితో ఈ ప్రపంచం ఎంత అందమైనదో చూడచ్చు!" అని.



అయితే ఆమె ఎదలో అంతుపట్టని విధంగా స్పందిస్తున్నదేదోగాని, ఇప్పుడు అది ఇంకా వేగంగా కొట్టుకుంటోంది. ఉండీ ఉండీ కాస్త నొప్పి కూడా పుడుతున్నది. ఎందుకో అర్థంకాలేదు చిన్నారిఫెయిరీకి.

కొండపైన ప్రకృతి సోయగాలను తనివి తీరా చూసిన తర్వాత, ఫెయిరీ లోయలోకి దిగింది. ఇప్పుడామె పచ్చ పచ్చని బయళ్ళున్న మైదాన ప్రాంతంలోకి వచ్చింది. ఇక తెల్లవారింది కూడా. గాలి సన్నగా వీస్తూంటే, చెట్లు ఒకదానితో ఒకటి గుసగుసలాడుతున్నాయి. పక్షులు కలకలలాడుతూ, మధురంగా సంగీతం పలికిస్తున్నాయి- ఎంతో ముచ్చటైన కచేరీ! ఫెయిరీ ఆగి, ఆ సంగీతాన్ని ఆస్వాదించటంకోసం తన కళ్ళు మూసుకున్నది. కానీ ఆ మధురమైన సంగీతం కళ్లతో ఆనందించేది కాదు! ఫెయిరీ ఇప్పుడు తన రెండు చేతులతోటీ చెవులు మూసుకొని చూసింది- అప్పుడు అర్థమయింది, చెవుల పరమార్థం! పట్టరాని ఉత్సాహంతో గంతులు వేసింది ఫెయిరీ- ఈ చెవులతో అడవిలోని సంతోష స్వరాలను వినవచ్చు! అట్లా వింటూ వింటూ ఆ చిన్నారి పాప సంతోషంతో పొంగిపోయింది. ఆమె ఎదలో ఆనందోత్సవాల కేరింతలు! దేనివి, ఆ స్పందనలు? ఏమిటో అది?! ఆ ఒక్కటీ మాత్రం అంతు చిక్కలేదు.



ఫెయిరీ సంతోషంగా నాట్యం చేయటం మొదలు పెట్టింది. ఆ చిన్నారి కేరింతలు అడవంతా ప్రతిధ్వనించసాగాయి. "ఈ ప్రపంచంలో అందరికంటే నేనే సంతోషవంతమైన ఫెయిరీని!" అని అరిచింది. "సంతోషవంతమైన ఫెయిరీని" అని ప్రతిధ్వనించింది మైదానం. అకస్మాత్తుగా ఆ క్షణంలో ఇంకొక క్రొత్త విషయం అర్థమయింది ఫెయిరీకి- తనకు నోరెందుకుందో తెలిసింది! ఆ పచ్చిక పైన పడుకొని, పగలబడి నవ్వసాగింది. ఫెయిరీ నవ్వుల శబ్దం వినేందుకు పక్షులు పోటీ పడ్డాయి. ఆశ్చర్యంతోటీ, సంతోషంతోటీ అవన్నీ తమ పాటలు ఆపేసిమరీ ఫెయిరీ నవ్వుల్ని విన్నాయి. చాలా సేపటి తర్వాత, అవి మళ్ళీ పాటలు మొదలుపెట్టేసరికి, ఫెయిరీ తన నవ్వులతో వాటికి పోటీగా పాడటం మొదలుపెట్టింది.

పాదాలు గాలిలో తేలియాడుతున్నట్లు, ఆ ఎర్రటి నేలపై నాట్యం ఆడసాగింది. చివరికి అలిసిపోయి, ఆ గడ్డిపైన పడుకొని- మట్టివాసన, పచ్చటి గడ్డి వాసన, మత్తైన మల్లెల వాసన ఎలా ఉంటుందో తెలుసుకున్నది. ప్రపంచపు సౌందర్యాన్ని తన ఇంద్రియాలతో రుచి చూసింది. కానీ తన ఎదలో కదలాడేదేమిటో తెలియలేదు ఇంకా. అతి ముఖ్యమైనది అదేనట! అదేమిటో ఇంకా తెలియలేదెందుకో.

ప్రక్కనే ఉన్న పొదల్లో నుంచి "ఉయ్! ఉయ్!ఉయ్!" అని మూలుగులు వినిపించాయి అంతలోనే. చిన్నారి ఫెయిరీ చెవులు రిక్కించి విన్నది. ఈసారి ఇంకా బాధగా అరుపులు వినిపించాయి. ఫెయిరీ ఆ వైపు తిరిగి, కొంచెం అనుమానంగా, కొంచెం బెరుకుగా, కొంచెం జాగ్రత్తగా-

"ఎవరది?" అని అడిగింది. ఫెయిరీకి అనుమానం, సిగ్గు, బెరుకు కాస్త ఎక్కువే.



"నేను, చిన్ని కుందేలును! నా కాలు చాలా నొప్పి పెడుతోంది. ఎవరైనా కాస్త సహాయం చేస్తారా?" అని వినబడింది పొదల్లోంచి. కొమ్మలు పక్కకు తీసి చూసింది ఫెయిరీ. లోపల, ఆ పొదలో- పాదం ఆకాశం వైపుగా పెట్టుకొని ఓ చిన్ని కుందేలు కనిపించింది.

"నీ పాదానికి ఏమైంది?" అని ఫెయిరీ అడిగింది. "ఏమో తెలీదు. పాదం నేల పై పెట్టాలంటే చాలా నొప్పిగా ఉంది" అని కుందేలు జవాబిచ్చింది. చిన్నారి ఫెయిరీ ఆ కుందేలు పిల్లను దగ్గరకు తీసుకొని దాని పాదాన్ని పరిశీలించింది. అందులో ఓ చేప ఎముక గుచ్చుకొని ఉండింది. "వాగును ఆనుకొని ఒడ్డున గంతులు వేస్తున్నప్పుడు గుచ్చుకొని ఉంటుంది" అనుకున్నది ఫెయిరీ.

"నువ్వు వాగు ఒడ్డున నడుస్తున్నప్పుడు నీ కాలిలో చేప ఎముక గుచ్చుకున్నది. అందుకని నొప్పి పుడుతున్నది. ఇప్పుడు నేను దాన్ని బయటికి తీస్తానులే" అని కుందేలును ఓదార్చి, మెల్లగా ఆ ఎముకను బయటికి లాగేసింది. "ఇదిగో వచ్చేసింది! ఇక నీపాదం బాగై పోతుందిలే" అని సంతోషంగా చెప్పింది.

కానీ కుందేలుకు ఇంకా నొప్పిగానే ఉంది. అప్పుడు ఫెయిరీ వాగు ఒడ్డుకు వెళ్ళి, ఒక కొబ్బరి చిప్పతో నీళ్ళు తెచ్చి, గాయాన్ని కడిగింది. ఒక ఆకును తెచ్చి, పాదానికి చుట్టి, గడ్డిని దారంలా పేని, కట్టు కట్టింది. అంతేకాక తను వెళ్ళి, కుందేలు త్రాగేందుకు, తినేందుకు కావలసినవి తెచ్చి

ఇచ్చింది. కొమ్మలతో చిన్ని కుందేలుకు ఒక బుజ్జి ఇల్లు కట్టి పెట్టింది. "గాయం తగ్గేంత వరకు ఈ ఇంట్లో ఉండు" అని చెప్పింది. "అబ్బ! ఎంత చక్కనైన దానివి! ఇంత మంచిగా, నేర్పుగా చేసినందుకు ధన్యవాదాలు! నాకున్న చేతులతోనైతే నేనెన్నటికీ నీలా ఇంత చక్కగా చేయలేక-పోయేదాన్ని" అని కుందేలు ఫెయిరీని మెచ్చుకున్నది.

అప్పుడు చిన్నారి ఫెయిరీ తన చేతులను, కుందేలు చేతులను మార్చి మార్చి చూసింది: "అరె! ఎంత వేరుగా ఉన్నాయి! నా కున్న వేళ్ళతోనైతే వేటినైనా బాగా పట్టుకోవచ్చు!" అప్పుడు ఆ చిన్ని ఫెయిరీకి తన చేతుల గొప్పదనం అర్థమయ్యింది. వాటితో ఏమేం చేయచ్చో, ఎంత చక్కగా చేయచ్చో తెలిసింది.

అప్పటికి ఇంక చీకటి పడటం మొదలయ్యింది. ఫెయిరీ ఇంటి దారి పట్టింది. "ఈ రోజు ఎంత నేర్చుకొన్నానో!" అని సంతోషపడ్డది. "కానీ ఆ అన్నిటి కంటే ముఖ్యమైనది ఏదోనే తెలీలేదు. అది తెలీకపోతే ఇక వేరేవి తెలిసికూడా ప్రయోజనం లేదనుకుంటాను" అనుకుంటూ నడవసాగింది. అంతలోనే ఆ పాపకు గూడులో నుంచి నేల పై పడిన ఒక చిన్న పక్షిపిల్ల కనపడింది.



ఆ పక్షి పిల్లకు ఇంకా ఈకలు రాలేదు. మొండి రెక్కలతో దయనీయంగా ఉన్న ఆ పక్షిని చిన్నారి ఫెయిరీ తన చేతిలోకి తీసుకున్నది-"అయ్యో! నీకు చలిగా ఉందేమో, ఆకలి కూడా వేస్తోందేమో, ఎలాగ?" అని దాన్ని అరచేతిలో పెట్టుకొనే అటూ ఇటూ కలయ చూసింది. ప్రక్కనే సాలీడు బూజులో ఇరుక్కొన్న చిన్న పురుగు

ఒకటి కనబడింది ఆ పాపకు. మెల్లగా తన వ్రేళ్ళతోఆ పురుగును పట్టుకొని, "ఈ పక్షి పిల్లకి నీ అవసరం ఎక్కువమ్మా, ఏమీ అనుకోకు" అంటూ దాన్ని పక్షి పిల్లకు ఆహారంగాపెట్టింది.

దాన్ని తీసుకొని ఇల్లు చేరిన తర్వాత, ముందురోజు రాత్రి కూర్చునట్టుగానే ఇంటి ముందరి మెట్ల మీద కూర్చుంది. క్రితంరోజు రాత్రి తన చేతిలో జాబిలి తునక ఉండింది. ఈ రోజు అవే చేతుల్లో దయనీయమైన స్థితిలో ఉన్న చిట్టి పక్షిపిల్ల ఉంది: "అబ్బా! ఎంత అందంగా, మెత్తగా, చిన్నగా ఉన్నావు! నేను నిన్ను జాగ్రత్తగా చూసుకుంటానులే, నువ్వు చక్కగా, పెద్దగా అవుతావు! ఎంతో చక్కగా పెరుగుతావులే! ఇక ఇప్పటినుండీ నా చేతులే నీకు గూడు. నువ్వు కంగారు పడాల్సిన అవసరమే లేదు" అని దానికి తియ్యటి కబుర్లు చెప్పసాగింది ఫెయిరీ పాప.



"ఓహో! నీ ప్రయాణాలన్నీ ముగించుకొని ఇంటికొచ్చినట్లున్నావే" అని గంభీర స్వరం ఒకటి వినబడింది: తెలివైన ముసలి గుడ్లగూబ అప్పుడే చెట్టు మొదలు పైన మెల్లగా వాలింది. "సరే! ఈ రోజు ఏమేం నేర్చుకొన్నావు, చెప్పు నీ యీ ముసలి స్నేహితుడికి" అని ఫెయిరీని అడిగిందది. ఆ రోజు జరిగింది అంతా పూసగుచ్చినట్టు చెప్పింది ఫెయిరీ. గుడ్లగూబ అప్పుడప్పుడూ తలాడిస్తూ మొత్తం శ్రద్ధగా విన్నది. "ఓహో! అలాగైతే రోజంతా చక్కగా గడిపినట్లే! ఇప్పుడు నీకు నీ గురించి అంతా తెలిసినట్లే గదా, ఇప్పుడు సంతోషంగా ఉన్నావా?" అని అడిగింది

ఫెయిరీని.

"లేదు,లేదు. ఇదివరకు ఉన్నట్లే ఇప్పుడు కూడా బాధగానే ఉన్నాను- ఎందుకంటే, ఆ అతిముఖ్యమైనది ఏంటో ఇంకా తెలియనే లేదు. నా ఎదలో ఎప్పుడూ స్పందిస్తున్నదేమిటో, నిండుగా ఉన్నట్లుండి, అదే సమయంలో ఖాళీగా ఉన్నట్లుండేది ఏమిటో, సంతోషంగా ఉన్నా నొప్పిలాగా అనిపించేది ఏమిటో అది మాత్రం ఇంకా తెలియలేదు" అని చెప్పింది ఫెయిరీ.

ఆ ప్రశ్నకు వెంటనే సమాధాన మివ్వకుండా గుడ్లగూబ- "నీ చేతులో ఏముంది?" అని అడిగింది. ఫెయిరీ తన అరచేయిని నెమ్మదిగా, మెత్తగా తెరిచి చూపించింది- "ఇంటికి తిరిగి వస్తుంటే, నిస్సహాయ స్థితిలో ఉన్న ఈ చిన్న పక్షిని చూశాను. దీనికి తిండి, వేడి ఇవ్వక పోతే చచ్చిపోతుంది. పాపం ! చిట్టి పక్షి " అంటూ దాన్ని హృదయానికి హత్తుకుంది.

ఓ క్షణం ఆగి, ముసలి గుడ్లగూబ ఇలా చెప్పింది: నీ అంతట నువ్వే నీ కళ్ళు, చెవులు, ముక్కు, నోరు, చేతులు కాళ్ళు ఎందుకున్నాయో తెలుసుకున్నావు- అంతేకాదు, చూడు- ఇప్పుడు నువ్వు నీ గుండె ఉపయోగాన్ని కూడా కనుక్కున్నావు. నీ ఎదలో ఎప్పుడూ స్పందిస్తూండేదీ, ఒకే సమయంలో సంతోషంతోటీ, బాధతోటీ రెండింటితోటీ ఖాళీగానూ, నిండుగా కూడాను ఉండేదీ, అదే. ప్రేమ, జాలితో నిండి పోయిన ఆ గుండే, ఎవరికైనా ఉండే అత్యంత విలువైన నిధి. అలా దయ, జాలి, ప్రేమలతో నిండుగా ఉండేదే నిజమైన హృదయం. ఇప్పుడు అర్థమైందా?" అని.

అప్పుడు ఆ చిన్నారి ఫెయిరీ తన చేతితో ఎదను తడిమింది ఆశ్చర్యపోతూ. "నాకు గుండె ఉన్నదా!" అన్నది. "కానీ నాకు దానితో ఏమి పని?" అని అడిగింది. "ఆ ప్రశ్నకు సమాధానం నీఅంతట నువ్వే చెప్పాలి. వేరేవాళ్ళు కాదు" అన్నది తెలివైన ముసలి గుడ్లగూబ.

అప్పుడు ఫెయిరీకి అన్నిటికంటే ముఖ్యమైనది ఎందుకున్నదో అర్థమయ్యింది- "అవును, ఇప్పుడు తెలిసింది ఈ హృదయం ఎందుకుందో: నిస్సహాయ స్థితిలో ఉన్నవాళ్ళకు సహాయం చేయటానికి, మంచిని ప్రేమించటానికి, ప్రపంచంలోని అందాన్ని ఇప్పుడే ఆస్వాదించడానికి!" అని చెప్పింది గుడ్లగూబతో.

తెలివైన ముసలి గుడ్లగూబ ఫెయిరీ పాపను చూసి మురిసిపోయింది. "అవునవును! సరిగ్గా చెప్పావు. నువ్వు చెప్పింది నీకు అర్థమయ్యింది! సరిగా ఉంది! ఇది నేర్చుకొన్న తర్వాత- ఓ చిన్నారి ఫెయిరీ, నువ్వింక ఫెయిరీవి కావు! నువ్విప్పుడు నిజంగా మానవ బాలికవు అయ్యావు. మానవజాతిలో అంతర్భాగం అయినావు ఇప్పుడు!" అని దీవిస్తూ అది ఆకాశానికి ఎగిరింది.

**జోకు**

ఉభయకుశలోపరి!

టీచర్:- ఒరేయి రామూ! ఒక ఉభయచర జీవి పేరు చెప్పరా?

రాము: కప్ప.

టీచర్:- ఒరేయి సోమూ! నీకు తెలిసిన ఒక ఉభయచర జీవి పేరు చెప్పరా?

సోము:- తల్లి కప్ప, పిల్ల కప్ప, తండ్రి కప్ప.

*సేకరణ: సుమిత్ర*

# చిరు చిరు చేతుల పాపల్లారా

*రచన: శ్రీ వారణాసి వెంకట్రావు* *గానం: అఖిల, తొమ్మిదవ తరగతి.*
*సమర్పణ: విద్యార్థి సృజన కుటీర్, విజయవాడ.*

చిరు చిరు చేతుల పాపల్లారా
పట్టండి పలకా బలపం-
విద్యనేర్వగా చుట్టండి శ్రీకారం! “చిరు చిరు”



ఓం నమ: శివాయ అంటూ
తొలిగా మీ చేతులు పట్టి
నల్లపలకపై దిద్దించే
తెల్లనైన ఆ అక్షరాలే
తెలుసుకోమనీచెప్పుచున్నవీ
విద్యంటే వెలుగనీ
ఆ వెలుగు చూపే గురువంటే
ఎదుట కనపడే దేవుడనీ! "చిరు చిరు"



వెన్నెలనిచ్చే చందమామ-
కొన్నాళ్ళే ఉంటాడెందుకు?
ఎండా వానలు కలసినప్పుడే
ఎందుకేర్పడును ఇంద్రధనస్సు?
దూరానెచటో జరిగేవి-
ఎలా కనపడును టీవీ తెరపై?
ఉదయించే ఈ ప్రశ్నలకు
చదువే చెప్పును సమాధానం "చిరు చిరు"

అటునిటు అంచులు ఉన్నటుల
అగుపడుతుంది ఆకాశం
ఒక ఒడ్డైనా ఉందికదా-
ఉప్పొంగే ఆ సముద్రానికి?
ఏ అంచులు హద్దులు లేని
అనంతమైన విద్యను
చారెడు మెదడున చేర్చవచ్చు-
కృషితోనే ప్రతి మనిషీ "చిరు చిరు"

# చెట్టు చెట్టు పుట్టిందట

*సంక్రాంతి గొబ్బిళ్ళ పాట*
*గానం: P. సంకీర్తన, R. చంద్ర, C.హరిత, 5.వతరగతి, టింబక్టు బడి.*
*స్వరకల్పన: K. గంగమ్మ, ఉపాధ్యాయులు.*





చెట్టు చెట్టు పుట్టిందంట ఏమి చెట్టు పుట్టిందంట
రాజమండ్రి యోజంలో జామ చెట్టు పుట్టిందంట
చెట్టు చెట్టు పుట్టిందంట ఏమి చెట్టు పుట్టిందంట
అవునాటే అక్కల్లారా? అవునాటే బావల్లారా?
సూరీడో గొబ్బిళ్ళో సూరీడో గొబ్బిళ్ళో!

పూత పూత పూసిందంట ఏమి పూత పూసిందంట
రాజమండ్రి యోజంలో జామ పూత పూసిందంట
అవునాటే అక్కల్లారా? అవునాటే బావల్లారా?
సూరీడో గొబ్బిళ్ళో సూరీడో గొబ్బిళ్ళో!

పిందె పిందె కాసిందంట ఏమి పిందె కాసిందంట

రాజమండ్రి యోజంలో జామ పిందె కాసిందంట

అవునాటే అక్కల్లారా? అవునాటే బావల్లారా?

సూరీడో గొబ్బిళ్ళో సూరీడో గొబ్బిళ్ళో!

కాయా కాయా కాసిందంట ఏమి కాయ కాసిందంట

రాజమండ్రి యోజంలో జామ కాయ కాసిందంట

అవునాటే అక్కల్లారా? అవునాటే బావల్లారా?

సూరీడో గొబ్బిళ్ళో సూరీడో గొబ్బిళ్ళో!

పండు పండు పండిందంట ఏమి పండు పండిందంట

రాజమండ్రి యోజంలో జామ పండు పండిందంట

అవునాటే అక్కల్లారా? అవునాటే బావల్లారా?

సూరీడో గొబ్బిళ్ళో సూరీడో గొబ్బిళ్ళో!

# ఇక్కడ త్రవ్వండి!

*నిర్వహణ: G.లలిత, telugu4kids.com*

ఈ బొమ్మను చూస్తే మీకేమనిపిస్తున్నది?



నలుగురు పట్నం పిల్లలు ఇక్కడ ఎందుకు త్రవ్వుతున్నారబ్బా..? ఏదైనా నిధికోసం వెతుకుతున్నారేమో..? లేకపోతే మరి పాపం, వాళ్ళ పెంపుడు పిల్లికి ఏమైనా అయ్యిందా? అలాకాకపోతే మరి, ఎవరైనా హంతకుడిని పట్టుకోబోతున్నారేమో! భూమికి ఆ చివరినుండి ఈ చివరికి రంధ్రం చేసి చూద్దామని కూడా ప్రయత్నిస్తుండవచ్చు.. మీకు తెలిస్తే చెప్పెయ్యండి! ఆ కథను వీలైనంత తొందరగా మాకు పంపించండి. బాగున్న కథలను కొత్తపల్లి కథల పుస్తకం ముప్ఫైఐదో భాగంలో ప్రచురిస్తాం.

**మా చిరునామా:** కొత్తపల్లి బృందం, 2-312, చెన్నేకొత్తపల్లి - 515 101,
అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్. (ఇ-మెయిలు: team@kottapalli.in)

# కథల కథ

అనగా అనగా ఒక చిన్న కథ తయారైంది. గెంతుకుంటూ, ఆడుకుంటూ పోతోంది ఆకాశంలో. అంతలో దానికొక రామచిలుక ఎదురైంది.

"చిట్టి కథా, చిట్టి కథా! నువ్వు భలే కనిపిస్తున్నావు. నేను నిన్ను తీసుకుంటాను, ప్లీజ్!" అన్నదది.

"తీసుకో, తీసుకో! దాందేముంది? నేనున్నదే అందరికోసం!" అన్నది చిన్న కథ.

రామచిలుక చిట్టి కథను తీసుకోగానే కథలు రెండైనై! చిలకేమో ఒక కథను పట్టుకొని ఎగురుకుంటూ పోయింది- బిగ్గరగా అరుచుకుంటూ.

ఇంకో కథ తన దారిన తను పోతూ ఉంటే చిన్నారి పాప ఒకతె ఎదురైంది దానికి, ఓ చెట్టుకొమ్మను పట్టుకొని.

"ఏం, చిన్నారీ! ఎటు పోతున్నావు, ఒక్కతెవే? మీ అమ్మేది?" అంది కథ.

"అమ్మ పోయి కొమ్మ వచ్చె ఢాం ఢాం ఢాం!" అని నవ్వింది పాప. కథకి పాపను చూస్తే ముచ్చట వేసింది.

అది పాపతో కలిసి పోయి, వాళ్ళ అమ్మనీ, అమ్మమ్మనీ, నాన్ననీ అందర్నీ చుట్టుకొని వచ్చింది.

రామచిలుక అక్కడ అరచుకొంటూ పోతుంటే మొద్దురాముడు ఎదురయ్యాడు దానికి: "ఏయ్! చిలకా! భలే కథ ఉన్నట్లుందే, నీ దగ్గర? నాకూ చెప్పు! వింటాను!" అన్నాడు వాడు.

"ఊరికే వింటే ఏం లాభం? రాయాలి! నీకు చేతులున్నై కద!" అంది చిలుక.

"ఊహ్! ఓహ్! అయ్యో! రాయటం రాదే!" మూలిగాడు వాడు.

"కుదరదు నాన్నా! నన్ను అందుకుంటే రాయాల్సిందే!" అన్నది కథ. "సరే" అని వాడు రాయటం నేర్చుకున్నాడు.

ఈ సారి ఒక్క కథే పది కథలైంది- ఎవరెవరినో చేరింది. అందరికీ చదవటం నేర్పింది.

ఆ కథని చదివిన పిల్లలెవ్వరూ దాన్ని ఆపుకోలేదు- అందరి దగ్గరా అది రెండింతలు అవుతూనే పోయింది. ఆ పిల్లల స్నేహితులు- వాళ్ళ అమ్మా నాన్నలు- వాళ్ళ స్నేహితులు- ఇట్లా పోతూనే ఉంది కథ- అందరూ విన్నారు; అందరూ చదివారు; అందరూ చెప్పారు!

చాలా ఏళ్ళ తర్వాత మాకు చెప్పిందొక పాప, ఆ కథని- "ఓయ్, కథా! రా! నిన్ను కొత్తపల్లిలో వేస్తాం" అన్నాం మేం.

"మా బాగా వేసుకోండి! నేనున్నదే అందరికోసం!" అన్నది కథ.

"సరేగానీ, నిన్నెవరు తయారు చేశారు, మొదట?" అడిగాం, మేం, పెద్దవాళ్ళం.


"అయ్యో! నేను ఎన్ని చోట్ల తిరిగాను, ఎంత మారాను! ఎప్పుడో ఒక రామచిలుక పాడింది నన్ను! ఒక మొద్దు రాముడు రాశాడు నన్ను! కానీ ఎందరు పిల్లలు బ్రతికించారో, ఏం చెప్పను? ఎంతమంది పెద్దలు మెచ్చి కాపాడారో, ఏమనను? మీరేమైనా మొదటివాళ్ళా? మీపని మీరు కానివ్వండి! నా దారిన నేను ఎగురుతూనే ఉంటాను" అని నవ్వింది కథ.

ఇదీ, ఈ కథల కథ!

Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP.
Ph:08559 240222 E-mail: team@kottapalli.in

మంచి పుస్తకం:

## బుడుగు




ముళ్ళపూడి వారి ఈ పుస్తకానికి ఇంకొక సమీక్ష ఎందుకు? ఏమీ అవసరం లేదు. చదవండి, నవ్వండి, ఆలోచించండి చాలు.